# ప్రజాశక్తి

మంగళవారం 27 ఆగస్టు 2025 | 12 పేజీలు




తిరుపతి

చిత్తూరు

## ఏపిఆర్ సెట్ కన్వీనర్‌గా ఆచార్య సురేంద్రబాబు

9 లో

# వినాయక విగ్రహం పర్యావరణ హితంగా..

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

పర్యావరణ హితమైన మట్టి, పత్రి తదితరాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఏజీఎస్ కళాశాల ప్రాంగణంలో వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు తయారీపై స్కూల్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు, పూల మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొని చిట్టి చేతులతో చేసిన మట్టి విగ్రహాలను పరిశీలించారు.కమిషనర్ మాట్లాడుతూ వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. విద్యార్థులు ఎంతో చక్కగా భక్తితో మట్టి విగ్రహాలు తయారు చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. ఇలాంటి పోటీలు పిల్లల్లో భక్తితో పాటు, సజనాత్మకతను వెలికి తీయడానికి ఉపకరిస్తుందని అన్నారు. వినాయక నిమజ్జనానికి వినాయక 2 లో

తిరుపతిలో జరిగిన 'ప్రజాశక్తి ' 45వ వార్షికోత్సవ సభలో ఎవరెవరు ఏమన్నారంటే...

12 లో

# 'వాస్తవాల' ప్రతిబింబం 'ప్రజాశక్తి'

కుప్పానాయుడుకు నివాళి అర్పిస్తూ...

## అక్టోబర్ 13, 14 తేదీల్లో... పుత్తూరులో సిఐటియు జిల్లా మహాసభలు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్**

అక్టోబర్ 13, 14 తేదీల్లో తిరుపతి జిల్లా సిఐటియు మహాసభలు పుత్తూరు పట్టణంలో జరుగుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వెల్లడించారు. పుత్తూరులో మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ సిఐటియు రాజీలేని పోరాటాలు నడుపుతూ జాతీయ కార్మికసంఘంగా దేశంలోనే ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైసిపి విధానాలనే కొనసాగిస్తోందని, కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. వైసిపి విధానాలు నచ్చక తిరగబడిన ప్రజానీకం, కూటమి ప్రభుత్వానికి అఖండ మెజార్టీని అందించారని గుర్తు చేశారు. అయితే ఈ విషయాన్ని మరచిపోయి కూటమి నేతలు ప్రజా వ్యతిరేకంగా తయారయ్యారని, 2 లో

వార్త తరువాయి..

## వినాయక విగ్రహం పర్యావరణ హితంగా..

సాగర్ లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ పోటీలో సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొని, చిట్టి చేతులతో మట్టి విగ్రహాలు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## వినాయకసాగర్‌లో ఏర్పాట్లు పరిశీలన

వినాయకసాగర్‌లో నిమజ్జనానికి జరుగుతున్న అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు.ఏర్పాట్లను పోలీసు, నగరపాలక సంస్థ, తుడా అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జనానికి వినాయక సాగర్ లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పిల్లలు పెద్దలు అందరూ వచ్చి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా నిమజ్జనం చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామని అన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసే వారందరూ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే ఆయా మార్గాల్లో రద్దీ లేకుండా, సాగర్ వద్ద సాఫీగా నిమజ్జనం చేసేందుకు వీలుంటుందని అన్నారు. విగ్రహాల నిమజ్జనానికి క్రేన్లు ఏర్పాటు చేస్తున్నామని, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచామని అన్నారు. తెప్పలను పరిశీలించాలని అన్నారు. అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, మానిటర్ల ద్వారా సిబ్బంది నిత్యం పర్యవేక్షణ ఉంటుందన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఈఈ రవీంద్ర, డీఎస్పీ భక్తవత్సలం, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

## పుత్తూరులో సిఐటియు జిల్లా మహాసభలు

ఎంఎల్ఎలు, ఎంపిలు, మంత్రులు సంపాదనే ధ్యేయంగా ప్రజలను కాల్చుకు తింటున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్ని రకాల అవినీతి కుంభకోణాల్లో, దౌర్జన్యాల్లో, భూకబ్జాల్లో వీరి పాత్ర గణనీయంగా ఉందని విమర్శించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇకనైనా కళ్లుతెరచి ప్రజానుకూలంగా వ్యవహరించాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పుత్తూరులో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు విచ్చేసి ప్రారంభిస్తారన్నారు. భారీ బహిరంగసభ, ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సిఐటియు పుత్తూరు పట్టణ కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలో మొట్టమొదటిసారి జరుగుతున్న సిఐటియు మహాసభలను ఘనంగా నిర్వహించడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, రాజేశ్వరి, రేవతి, మునికుమారి, కృష్ణవేణి, బాష, రాధ, గంగులమ్మ, లలిత పాల్గొన్నారు.

## ఆదర్శ నేత కుప్పానాయుడు

పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి పూర్తి చేసి ఉద్యోగాల వెంట పడకుండా... సామాన్యుల జీవితాలలో మార్పు కోసం ఉత్తర కోస్తా, మెదక్, అదిలాబాద్ లాంటి వివిధ ప్రాంతాలలో గిరిజనులు, దళితుల ఉద్ధరణ కోసం జీవించిన ధన్య జీవి కామ్రేడ్ రావిళ్ల కుప్పా నాయుడు ఆదర్శ జీవి. అని. సిఐటియు జిల్లా కార్యదర్శి కందారపు మురళి.వ్యాఖ్యానించారు. పుత్తూరు మండలం రామసముద్రం గ్రామానికి చెందిన రావిళ్ళ కుప్పా నాయుడు 14వ వర్ధంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో పుత్తూరు లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సంస్మరణ సభను సిఐటియు పట్టణ కార్యదర్శి ఆర్ వెంకటేష్ అధ్యక్షతన.నిర్వహించారు. రాజకీయాలలో సంపాదనే లక్ష్యంగా అవినీతి, అక్రమార్జనలే గొప్పవిగా ప్రస్తుత సమాజంలోని నయా విలువలని .కుప్పా నాయుడు లాంటి వ్యక్తులు... మానవీయ విలువలకు కొత్త అర్థం చెప్పి సమాజాన్ని చైతన్య పరిచిన అతికొద్ది మంది వ్యక్తులలో ఒకరని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్ గా రాష్ట్రంలోని పేదలు, గిరిజనులు, దళితులు సమస్యలపై అవిరళ కషి చేశారని అన్నారు. సామాన్యుడు అధికారాన్ని చలాయించిన రోజునే సమాజంలో పేదలకు విముక్తి ప్రాప్తిస్తుందని నమ్మి చివరి కంటా ఆచరణాత్మకంగా జీవించి సామాన్యుల కోసం అశువులు బాసిన ధన్యుడు కామ్రేడ్ కుప్పా నాయుడని.అభివర్ణించారు. కామ్రేడ్ కుప్పా నాయుడికి వారసులుగా జీవించడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పా నాయుడి బంధువులు గోపాల్ నాయుడు, భాస్కరరావు పాల్గొన్నారు.

అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో..

భారీ ఎత్తయిన విగ్రహానికి అడ్డమని..

## పర్యావరణ హితమా...! చెట్లు కూల్చివేత

జనం కూర్చునేందుకు లేకుండా..

అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో

తిరుపతి రోడ్లపైనా కొమ్మలు నరికివేత

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

వినాయక చవితి పురస్కరించుకుని మట్టివిగ్రహాలు పెట్టి, పర్యావరణాన్ని కాపాడాలని చెబుతున్న పెద్దలంతా ఏకంగా అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో చెట్లను నరుకుతున్నా పట్టించుకోలేదు.. నగరంలో ఎత్తయిన విగ్రహాలు వెళ్లడానికి చెట్టు కొమ్మలు అడ్డుగా ఉన్నాయని ఏకంగా చెట్టు కొమ్మలు నరికేశారు తప్ప, విగ్రహాలు ఎత్తు తగ్గించుకోవాలని చెప్పలేకపోయారు. ఇవి తిరుపతిలో జరిగిన రెండు ఘటనలు.

తిరుపతి అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వరండా వద్ద అర్జీదారులు కూర్చోడానికి వీలుగా పదేళ్ల క్రితం చెట్టుకింద తిన్నె నిర్మించారు. ఆదివారం పుత్తూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు స్థానిక అధికారులకు చెప్పా పెట్టకుండా చెట్టును నరికి వేయడమే కాకుండా ప్రజలు కూర్చున్న 'తిన్నె'ను కూల్చివేశారు. సోమవారం అర్జీలు ఇచ్చే దానికి వచ్చిన ప్రజలు అర్బన్ తాసిల్దార్ కార్యాలయం వద్ద కూర్చునే సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. అర్బన్ తాసిల్దార్ కార్యాలయం ఆనుకొని అప్పటి తహశీల్దార్ గా పనిచేసిన వెంకటేశ్వర్లు గుడిని నిర్మించారు. ప్రతిరోజూ పూజలు నిర్వహించడమే కాకుండా పండుగ వేళలో భారీ ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే గుడికి వచ్చే భక్తులు సౌకర్యాల కోసం అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో ఉండే చెట్టును కూల్చేయడమే కాకుండా ప్రజలు కూర్చునే తిన్నెను కూల్చివేయడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ విషయమై తిరుపతి అర్బన్ తహశీల్దార్ కార్యాలయం అధికారులను అడిగితే తాము చెట్టును కూల్చలేదని, ప్రజలు కూర్చునే తిన్నెను కూల్చలేదని, గుడి కోసం పుత్తూరు తహసిల్దార్ కూల్చివేశారని అంటున్నారు. ఏదిఏమైనా ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అర్జీలు రాసుకునే స్థలం వద్ద ఉన్న తిన్నెను కూల్చడమే కాకుండా, భారీ చెట్టును నరకడాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా తిరుపతి అర్బన్ తాసిల్దార్ జోక్యం చేసుకొని ప్రతి సోమవారం అర్జీలు రాసుకునే విధంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు

## అసత్య ఆరోపణలతో బురద జల్లొద్దు

టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

**ప్రజాశక్తి - తిరుమల**

'దేవుడంటే భయం లేదు.. భక్తి అసలే లేని కరుణాకర్ రెడ్డి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా టిటిడిపై బురద జల్లడం మానుకోవాలి' అని తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి సూచించారు.. టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు, సహచర బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పనబాకలక్ష్మితో కలిసి తుడా చైర్మన్ టిటిడి బోర్డు సభ్యులు దివాకర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. దేవలోక్ నిర్మాణం చేపటిదలచిన అజయ్ కుమార్ అనే వ్యక్తి ని గత ప్రభుత్వ పెద్దలు గన్‌తో బెదిరించి 20 ఎకరాల భూమిని వెనక్కు తీసుకుని ముంతాజ్ హోటల్ కు ఇచ్చారని గుర్తు చేశారు. నేడు ఆ వ్యక్తులే తమ కూటమి ప్రభుత్వంపై, టిటిడి పై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. తమ హయాంలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సంతప్తికర దర్శనం కల్పిస్తూ అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. టిటిడి మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి రూమ్ లో కెమెరా ముందు కూర్చుని టిటిడి పై బురద జల్లాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. చేసిన తప్పులకు పశ్చాత్తాపం పడుతూ గోవింద నామస్మరణ చేసుకోవాలని హితవు పలికారు.. అనేక తప్పుడు నిర్ణయాలతో టిటిడి ప్రతిష్టను అప్రతిష్ట పాలు చేసిన వ్యక్తి నేడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

## మంగళం డిపోను సందర్శించిన ఆర్టీసీ ఈడీ

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

తిరుపతి జోనల్ పరిధిలోని మంగళం డిపోను ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూట్ డైరెక్టర్ (ఈడి) టి చంగల్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీ శక్తి (మహిళలకు ఉచిత బస్సు) పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న మంగళం డిపో అధికారుల, సిబ్బందిని అభినందించారు. ముఖ్యమంత్రి సైతం మంగళం డిపో సిబ్బందికి అభినందనలు తెలిపారని తెలియజేశారు. తిరుమల ఘాట్ రోడ్లకు తిరిగే బస్సులను క్రమం తప్పకుండా కండిషన్లు పరిశీలిస్తూ, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, డిప్యూటీ సిటిఎం విశ్వనాథ్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బాలాజీ, మంగళం డిపో మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

## వసతిగృహ పరిసరాలు శుభ్రంగా ఉండాలి

**ప్రజాశక్తి - రేణిగుంట**

స్కూలు, సంక్షేమ హాస్టళ్ల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశించారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు కిరణ్‌కుమార్‌తో కలిసి వసతి గృహాన్ని సందర్శించారు. వసతిగృహ పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా చూడాలని, వాడుక నీరు వారానికి మించి నిల్వ ఉండరాదన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. భోజనం చేసే ముందు, మలమూత్ర విసర్జన తరువాత తప్పనిసరిగా సబ్బుతు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. వర్షాల వల్ల వాతావరణంలో కలిగే మార్పులు సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయని, కాచి చల్లార్సిన తాగునీటిని మాత్రమే తాగడం మంచిదని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జికా, బోధవ్యాధి, మెదడువాపు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

## 7న శ్రీవారి ఆలయం మూత

**ప్రజాశక్తి - తిరుమల** చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7 మధ్యాహ్నం 3.30 గంటల నుండి సెప్టెంబర్ 8 ఉదయం 3 గంటల వరకు దాదాపు 12గంటల పాటు తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నట్లు టిటిడి పేర్కొంది. సెప్టెంబర్ 7న ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై సెప్టెంబర్ 8న సోమవారం వేకువజామున 1.31 గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి ఆరు గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబర్ 8న ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీవారి దర్శనం పున్ణప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 7న ఆదివారం ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. అన్నప్రసాద వితరణ కేంద్రాలు మూతబడనున్నాయి. సెప్టెంబర్ 8వ తేదీ ఉదయం 8.30 గంటలకు అన్నప్రసాదాల పంపిణీ పున్ణప్రారభమవుతుంది. భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా టీటీడీ అన్నప్రసాదం విభాగం ఆధ్వర్యంలో 30 వేల పులిహోర ప్యాకెట్లను సెప్టెంబర్ 7 సాయంత్రం 4.30 గంటల నుండి పంపిణి చేయనున్నారు.

## స్విమ్స్‌లో అలైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సుకు 2వ కౌన్సిలింగ్

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో 2025 –26 వ విద్యా సంవత్సరానికి గాను బి. ఎస్.సి. (నర్సింగ్), బి.పి.టి, బి. ఎస్.సి. అలైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సుల్లో ప్రవేశానికి 2వ విడత వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగష్టు 28 నుండి 29 వతేదీ వరకు స్విమ్స్ వెబ్సైట్ లో పొందు పరచిన లింకు ద్వారా కోర్సుల ఎంపికను చేసుకోవలని, దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులకు ఎస్ ఎంఎస్, ఈ –మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వబడుతుంది. ఖాళీ సీట్ల సంఖ్య, ఫీజు వివరములు, ఎంపిక విధానం, వెబ్ ఆప్షన్ లింక్, వివరములకు స్విమ్స్ వెబ్సైటు ను సందర్శించాలని సూచించారు.

## టీటీడీకి స్కానర్ విరాళం

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**

తిరుపతి రీజనల్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారు టిటిడికి రూ.61.72 లక్షల విలువ గల స్మిత్ డిటెక్షన్ హై స్కాన్‌ను విరాళంగా అందించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో మంగళవారం ఐఓబి డైరెక్టర్ చంద్రారెడ్డి, రీజనల్ మేనేజర్ సంజయ్ కుమార్ ఝూ రూ. 61.72 లక్షల మంజూరు కాపీని టీటీడీ ఈవో జె.శ్యామలరావుకు అందించారు. తిరుమల శ్రీవారి ఆలయం సమీపంలో గల ఉగ్రాణం నుండి లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీలో వినియోగించే ముడి సరుకులను శ్రీవారి పోటుకు పంపించే ముందు తనిఖీ చేసేందుకు ఈ స్కానర్ ను వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఐఓబి మేనేజర్ మహేష్ బాబు, మార్కెటింగ్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్న తహశీల్దారు మధుసూదన్

## మండలానికి 13,293 స్మార్ట్ రేషన్ కార్డులు

**ప్రజాశక్తి -సోమల:** సోమల మండలంలోని 37 చౌక దుకాణాలకు సంబంధించి 13,293 స్మార్ట్ రేషన్ కార్డులు తహశీల్దారు కార్యాలయానికి చేరాయి. తహశీల్దారు మధుసూదన్ మంగళవారం చౌక దుకాణ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారి మొబైల్ ఫోన్‌లలో ఈ పౌరసరఫరాలు యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను మండలానికి పంపిణీ చేసిందని వీటి ద్వారా ఇకపై చౌక దుకాణాలలో నిత్యావసర సరుకులు పొందవచ్చునని కారులో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా చౌక దుకాణాలలోని ఈపాస్ మిషన్లలో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు, బియ్యం, చక్కెర ఇతర నిత్యావసర సరుకులు ఎంతెంత ఇవ్వాలో తెలుస్తుందన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా చౌక దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ బ్యానర్ కనిపించే విధంగా ప్రతి చౌక దుకాణ డీలరు నిబంధనలు పాటించాలని ఈ పౌరసరఫరాల యాప్‌ను కచ్చితంగా వినియోగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, చౌక దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

**ప్రజాశక్తి -కార్వేటినగరం:** సాయి బాలాజీ నగర్‌లో వెలసిన శ్రీషిరిడీ సాయినాధుని ఆలయంలో 18వ వార్షి కోత్సవ వేడుకలు మంగళ వారం ఘనం గా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి భూపాలి, కాకడ హారతి, అభిషేక కార్యక్రమాలు చేపట్టారు. 8గంటలకు షిరిడి సాయినామ సంకీర్తనలు చేపట్టారు. అనంతరం స్వామిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పుష్పాలంకరణకు ఉభయ దారులుగా ఆర్ బాలాజీ, దిలీప్ రాజు, కె నారాయణ రాజు వ్యవహరించారు. ఆలయంలో వేద పండితులు వేద మంత్రాలతో వార్షికోత్సవ వేడుకల పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలాజీ, ఎంపీపీ లత దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం బెంగళూరుకు చెందిన వైఎస్ మాధవరాజు సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామికి ధూప హారతి, రాత్రి 8 గంటలకు శేజ్ హారతి సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి. గౌతంరాజు, చిరంజీవిరెడ్డి, అర్చకులు, భక్తులు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## రేపు పలమనేరు మున్సిపల్ సమావేశం

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, విలేకరులు తప్పకుండా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ యార్డు పరిశీలన

**ప్రజాశక్తి -సోమల:** మండల కేంద్రమైన సోమల లోని మార్కెట్ కమిటీ యార్డును కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు మంగళవారం పరిశీలించారు. నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు ఆర్ జెడికి ఘన స్వాగతం పలికి మార్కెట్ యార్డు లో సమస్యలను వినిపించారు. మరుగుదొడ్లు విద్యుత్ సౌకర్యం, అదనపు గదులు అవసరమని వీటి కోసం 50 లక్షల రూపాయల ప్రతిపాదనలు గతంలో పంపిం చామని వాటిని ఆమోదించి నిధులు మంజూరు చేయాలని ఆర్జెడిని కోరారు. ఛైర్మన్ విన్నపాన్ని పరిశీలిస్తామని త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యే విధంగా చూస్తామని మార్కె ట్ యార్డులో మామిడి టమోటా, కూరగాయలు, చింత పండును రైతులు అమ్ముకోవడానికి సౌకర్య వంతంగా మండీల నిర్మాణం ఉన్నాయని మార్కెట్ యార్డును అన్ని విధాల ఉపయోగించుకునేలా ఛైర్మన్ రైతులతో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సరళా కుమారి, కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఆర్‌జెడి రామాంజనేయులు

## ఎరువుల దుకాణాల తనిఖీ

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరులో మంగళవారం మధ్యాహ్నం జిల్లా వ్యవసాయ అధికారి జే మురళీకృష్ణ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మన గ్రోమోర్ సెంటర్లో నిల్వ ఉన్న ఎరువులను, వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించి డిబిటి విధానాన్ని సమీక్ష నిర్వహించి, ఎంఆర్‌పి ధరలకు రైతులకు ఎరువులు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ పుంగనూరు శివకుమార్ , ఏవో సంధ్యా , ఎఇవో కుమార నాయుడు పాల్గొనారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

## ఎస్‌టీఓగా ప్రసన్న రాణి

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** సబ్ ట్రెజరీ అధికారిణిగా ప్రసన్న రాణి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు .ఇక్కడ పనిచేస్తున్న ఎస్ టి ఓ రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుండి ఇన్‌ఛార్జి గా వెంకటపతి నాయుడు ఉన్నారు. ప్రస్తుతం ఆ స్థానంలో బంగారుపాల్యం ఎస్‌టిఓగా పూర్తి బాధ్యతలు ప్రసన్నకుమారి చేపట్టారు. ఈమె తిరుపతి నుండి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ప్రసన్న కుమారిని ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరి రాజు, రాజ్యలక్ష్మి ,చిట్టెమ్మ , బేరీనాథ్ పలువురు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టివోను అభినందిస్తున్న

## అక్రమ వాహనాలు పట్టుకున్నాం..

- అనుమతులు చూపిస్తే వదిలేస్తాం
- తహశీల్దారు లోకనాథపిళ్లై

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :** ఎస్ఆర్ పురం మండల పరిధిలో పాత పాలెం సమీపం నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారని సోషల్ మీడియాలో వార్తలు చూసిన తర్వాత మట్టిని తర లిస్తున్న వాహనాలకు సంబంధిం చిన తాళాలు తెచ్చామని సరైన ఆధారాలు చూపితే వదిలేస్తామని తహశీల్దారు లోకనాథ్ పిళ్లై అన్నారు. మంగళవారం సాయంత్రం తహశీల్దారు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పాతపాలెం నుంచి చిత్తూరు తచ్చూరు రోడ్డుకు పనుల కోసం అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తన సిబ్బందిని పంపి కాగితాలను పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్కడ పనిచేస్తున్న వారు సరైన కాగితాలు చూపకపోవడం, మైన్స్ కు వీరి చెల్లించిన పైకం రసీదులు చూపకపోవడంతో తాత్కాలికంగా పనులు ఆపేశామని వాహనాలకు సంబంధించిన తాళాలు తీసుకున్నామని తెలిపారు. యజమానులు అక్కడ లేకపోవడంతో కాగితాలు తీసుకురా వాలని తర్వాతే పనులు ప్రారంభించాలని సరైన కాగితాలు చూపించిన తక్షణ పనులు ప్రారంభించుకోవచ్చని తహశీల్దా రు తెలిపారు. అయితే ఈ పనులు కోసం ఈనెల ఆగస్టు ఆరో తేదీ 30 వేల క్యూబిక్ మీటర్లకు తహశీల్దారు కార్యాలయం నుంచి అనుమతులు ఇచ్చారని, దీనికి సంబంధించి మైన్స్ డిపార్ట్మెంట్ కి క్యూబిక్ మీటర్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలని, ధర చెల్లించిన రసీదులు తాహశీల్దార్ కార్యాలయానికి ఎ ం ఐ తే వాహనాలను వదిలేస్తామని తెలిపారు.

నిందితుడిని కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

## ప్రింటర్ల దొంగ అరెస్ట్

**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** మండలంలోని రైతు భరోసా కేంద్రంలో రెండు ప్రింటర్లను దొంగతనం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించి అరెస్టు చేసినట్టు వెదురు కుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొమ్మరగుంట రైతు సేవా కేంద్రంలో ఈ నెల 7వ తేదీ రాత్రి రెండు ప్రింటర్లు అపహరణకు గురయ్యాయి. తమ సిబ్బందిని అప్రమత్తం చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పచ్చికాపల్లం హరిజన వాడకు చెందిన కె మురళి నిందితుడిగా గుర్తించారు. ఆయన పాత ఇనుప సామాన్లు అమ్ముకుంటున్నటుల తెలిసిందన్నారు. నిందితుడిని పుత్తూరు కోర్టు జడ్జి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఫొటో గ్రాఫర్ మృతి

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** ఐషర్ వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఫొటో గ్రాఫర్ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని మొగిలి ఘాట్‌లో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప కథనం మేరకు..వేలూరు సత్వాచారి చెందిన సుల్తాన్ బాష కుటుంబ సభ్యులు బెంగళూరులో వివాహ వేడుకలకు వేలూరు నుండి 8 మందితో పాటూ ఫొటోగ్రాఫర్ ను తీసుకెళ్లారు. సోమవారం నిర్వహించిన ఫంక్షన్ లో అందరూ పాల్గొని మంగళవారం ఉదయం బెంగళూరు నుండి బయలుదేరి వేలూరుకి వెళుతుండగా మొగిలి ఘాట్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళుతున్న ఐషర్ వాహనం నెమ్మదిగా వెళ్లడంతో అతివేగంగా వస్తున్న టవేరా కారు వెనుక భాగంలో ఢీకొంది. ఈ సంఘటనలో ఎడమ పక్క కూర్చున్న వేలూరు చెందిన దొరైస్వామి కుమారుడు ఫొటోగ్రాఫర్ వినోద్ కుమార్ (45) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫొటో గ్రాఫర్

## యువతి అదృశ్యం

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** యువతి అదృశ్యమైందని తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు తవణంపల్లి మండలం మొదలపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ కుమార్తె రాధిక సోమవారం మధ్యాహ్నం బంగారుపాలెం మండలం తంబుగానిపల్లి గ్రామానికి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళుతున్నట్టు చెప్పి అక్కడికి వెళ్లక అదృశ్యమైందని ఆమె తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## పారదర్శకంగా మెగా డీఎస్‌సీ నియామకాలు..

- యువతను మోసం చేసిన జగన్
- ఎమ్మెల్యే మురళీమోహన్

**ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి):** కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీ ప్రకారం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించిందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మంగళవారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్మె మాట్లాడుతూ ప్రతి ఏడాది మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెట్టే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సులో మినహాయింపులు ఇచ్చి వారికి ప్రభుత్వం అండగా నిలిచిందని గుర్తు చేశారు. యువతకు ఉపాధి రాకుండా చూడాలనే ఉద్దేశ్యంతో జగన్ రెడ్డి 24 కేసులు వేసినా వాటిని తట్టుకుని మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తిచేయించిన ఘనత లోకేష్‌దేనని పేర్కొన్నారు. విద్యారంగంలో నాణ్యతకు కావలసిన మౌలిక వసతులు, స్టూడెంట్-టీచర్ రేషియో కల్పించేందుకు లోకేష్ నాయకత్వంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని తెలిపారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం రెండు డీఎస్సీల ద్వారా 18,000 పైగా పోస్టులు భర్తీ చేసిందని, దాదాపు 13 డీఎస్సీల ద్వారా 1.80 లక్షల పైగా టీచర్ పోస్టులు భర్తీ చేసిన చరిత్రాత్మక ఘనత ఉందని గుర్తు చేశారు. కానీ జగన్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు ఒక డీఎస్సీ కూడా ఇవ్వకుండా యువతను దారుణంగా మోసం చేసిందని ఆయన మండిపడ్డారు.

**IN THE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) OF PAKALA**
**E.A.No.38 of 2022**
**E.P.No. of 2022**
**O.S.No. 186 of 2018**

Between:
**M.Rajaiah** ...Petitioner/D.Hr.
And:
**T.Prabhakar (died) rep. by his L.Rs.** ....Respondents/J.Drs.

**NOTICES TO THE PROPOSED JUDGMENT-DEBTORS No.4 & 5**

To:
**1)T.Baby,** D/o late T.Prabhakar, D.No.21-68, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.
**2) T.Sujatha,** D/o late T.Prabhakar, D.No.7-129, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.

**Madam,** Please take notice that the above named D.Hr. filed the above E.A. seeking order to attach E.P. schedule mentioned property by dispensing notice to the L.Rs./ Proposed J.Drs. No.2 to 7 and the above E.A. is posted to **25-09-2025** for your appearance before the said court. Please be present on the said date at about **10.30 a.m.** either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided in your absence as exparte.

Place:Pakala Sd/-**G.B.PRASANNA**
Date:26-08-2025 Counsel for Decree-holder

**IN THE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) OF PAKALA**
**E.A.No.39 of 2022**
**E.P.No. of 2022**
**O.S.No. 186 of 2018**

Between:
**M.Rajaiah** ...Petitioner/D.Hr.
And:
**T.Prabhakar (died) rep. by his L.Rs.** ....Respondents/J.Drs.

**NOTICES TO THE PROPOSED JUDGMENT-DEBTORS No.4 & 5**

To:
**1)T.Baby,** D/o late T.Prabhakar, D.No.21-68, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.
**2) T.Sujatha,** D/o late T.Prabhakar, D.No.7-129, Srinagar Colony, Vaikuntapuram, Tirupati.

**Madam,** Please take notice that the above named D.Hr. filed the above E.A. to implead the LRs of the 1st J.Dr(T.Prabhakar) as J.Drs. 2 to 7 and the above E.A. is posted to **25-09-2025** for your appearance before the said court. Please be present on the said date at about **10.30 a.m.** either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided in your absence as exparte.

Place:Pakala Sd/-**G.B.PRASANNA**
Date:26-08-2025 Counsel for Decree-holder

# సమన్వయంతో పనిచేయాలి

- బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి -ఐరాల:** వివిధ శాఖల అధికారులు సమన్వంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాణిపాకం ఆలయ ఈఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌పి మణికంఠ చందోలు, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, ఈవో పెంచల కిషోర్, ఇతర సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుండి సెప్టెంబరు 16వ తేదీ వరకు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, వైద్య ఆరోగ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా భక్తులకు మంచి దర్శనం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆర్డీవో, డిఎస్‌పి, ఆలయ ఈవో ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లపై ఆలయ ఈవో అధ్యక్షతన సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ ద్వారా ప్రాథమిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారన్నారు. ఆలయ ఈవో, విద్యుత్ అధికారులు, ఫైర్ ఆఫీస్ అధికారులు ఆలయం వెలుపల, ఆలయం లోపల విద్యుత్ సౌకర్యం ఎలా వుందో పరిశీలించాలన్నారు. వాహనం తిరిగే సమయంలో విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశిం చారు. చిత్తూరు ఆర్డిఓ ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ఏర్పాటు చేశామని తహశీల్దారులు, డిప్యూటీ తహశీల్దారులు విధులు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఉత్సవాలు సందర్భం గా వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, అంబులెన్సులు, నైపుణ్యం కలిగిన డాక్టర్లను నియమించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి, కాణిపాకం గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. మొదటి రోజు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిం చడానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి వస్తారని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో శాంతి భద్రతలు పరిరక్షణకు ప్రత్యేక డిఎస్పి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డు ను ఏర్పాటు చేశామని తెలిపారు. దేవాలయం ప్రాంగణం, స్థూప మండపం, కోనేరు, పార్కింగ్ బస్టాండు, కళ్యాణ కట్ట వద్ద పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టామన్నారు. సీసీటీవీ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా ఫైర్ ఆఫీసర్, ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్, ఎస్పీడీఎస్ఎల్, సంబంధిత డీఎస్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇలాగైతే జ్వరాలు రావా..?

**ప్రజాశక్తి- పూతలపట్టు:** పూతలపట్టు మండల కేంద్రంలో మురుగునీటి కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువలలో మురుగునీరు స్తంభించి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రభుత్వ ఆస్పత్రి ముందున్న మురుగు కాలువను వారాలు తరబడి శుభ్రం చేయక పోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో మురుగు స్తంభించి పోయింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే ప్రజలు దుర్వాసనతో ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

అపరిశుభ్రంగా మారిన ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మురుగు కాలువ

## మొరవను పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

వృథాగా పోతున్న నీటిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

**ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:** మండలంలోని తూగుండ్రం పంచాయతీ, తూ గుండ్రం పెద్ద చెరువు మొరవకు గండి- నీరు వృథా' అనే శీర్షికన ప్రజాశక్తి దిన పత్రికలో వార్త సోమవారం వెలువడింది. దీనిపై స్పందించిన ఇరిగేషన్ ఏఈ భాస్కర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి తూగుండ్రం మొరవ డ్యామును మంగళవారం పరిశీలించారు. పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమ నాయుడు, చెరువు ఛైర్మన్ వెంకటేష్ నాయుడు పరిస్థితులను ఆయనకు వివరించారు. ఆయకట్టు వివరాలను తెలిపారు. మొరవ గండికి మరమ్మతులు చేస్తే రైతులకు మేలు చేకూరుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం పీహెచ్సీ మాజీ ఛైర్మన్ నరసింహులు నాయుడు, జిల్లా టిడిపి క్రిస్టియన్ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శాంత కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షుల రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, మాజీ సర్పంచ్ లోకనాథం, బూత్ కన్వీనర్ శంకర్, టిడిపి నాయకులు అతేహర్ అలీ, రాఘవేంద్ర, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కర్ణ, సురేంద్ర పాల్గొన్నారు.

## 4న వాహనాల వేలం : ఎంవిఐ

**ప్రజాశక్తి-పలమనేరు:** వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పలమనేరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం లో సెప్టెంబర్ 4 వ తేదీన వేలం వేయనున్నట్లు ఎంవి ఐ మధుసూదనరావు మంగళవారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వివిధ వాహనాలను నిర్బంధించి పోలీస్ స్టేషన్, ఆర్టీసీ బస్సు స్టాండ్‌లలో వుంచామని తెలిపారు. వీటి యజమానులు సకాలంలో అపరాధ రుసుంను చెల్లించకపోవడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొన్న దలచిన వారు కార్యాలయంలో పని వేళలలో వాహనాల వేలంలో పాల్గొనాలనుకున్న వారు ఆధార్ కార్డు తో 5వేలు రూపాయలు తిరిగి ఇవ్వ ని డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన వచ్చునని ఎంవిఐ మధుసూదనరావు తెలిపారు.

# స్టార్టర్ల భద్రతపై 'అన్నదాతల' కలవరం

- రెచ్చిపోతున్న స్టార్టర్ల దొంగలు
- ఎండిపోతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

**ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించి, లాభాలు కళ్లు చూడక, అప్పులు తడిసి మోపిడయినప్పటికీ పంటలు పండిస్తున్న రైతన్నలకు కన్నీటి దార ఏదో ఒక రూపంలో కాల యముడై వెంటాడుతూనే ఉంది.**

**ప్రజాశక్తి -ఏర్పేడు :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏడాదిలో రెండో పంట ఖరీఫ్ సమయంలో సుమారు 80 శాతం బోర్లు, బావులు, కాలువలు మీదే ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. కానీ దొంగల బెడద అన్నదాతలను వెంటాడుతూనే ఉంది. గతంలో చూసినట్లయితే శ్రీకాళహస్తి మండలంలోని రామలింగాపురం, రేణిగుంట మండలంలోని కరకంబాడి, ఏర్పేడు మండలంలోని ఎండి పుత్తూరు, బండివానిపల్లి పరిసర ప్రాంతాలలో స్టార్టర్లు, రాగి వైర్లు అపహరణకు గురైన సంఘటనలు మరెన్నో వెలుగులోకి వచ్చాయి. అయితే పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళలో దుండగులు స్టార్టర్లను ధ్వంసం చేసి వైర్లను కత్తిరించి దోచుకెళుతున్నారని రైతులు చెబుతున్నారు. తాజాగా సోమవారం రాత్రి ఏర్పేడు మండలంలోని మల్లంపల్లి, చింతలపాలెం రైతులకు సంబంధించి సుమారు 30 స్టార్టర్లును దుండగులు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారని రైతులు లబోదిబోమంటున్నారు.





## రెచ్చిపోతున్న స్టార్టర్ల దొంగలు..

స్టార్టర్ నుంచి మోటార్ కేసింగ్ పై భాగం వరకు సుమారు 5 నుంచి 10 మీటర్లు రాగి వైరును మోటరుకు అనుసంధానం చేస్తారు. ఆయిల్ స్టార్టర్లలో రాగి ఎక్కువ మోతాదులో ఉంటుంది. ప్రస్తుతం రాగి మార్కెట్లో కేజీ రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పలకడంతో కొందరు దుండగులు విలాసాలకు అలవాటుపడి ఇలా రైతు నోట్లో మన్ను కొడుతున్నారు. పోలీస్‌లు పూర్తిస్థాయిలో చోరీలకు పాల్పడుతున్న వారి పట్ల నిఘా ఏర్పాటుచేసి ప్రత్యేక చర్యలు చేపట్టకపోతే నోటి కాడికి వచ్చిన కూడు చేయి జారిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆందోళనలో రైతులు..

జూన్ మాసంలోనే రైతులు మండల వ్యాప్తంగా గతేడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 6వేల ఎకరాలు పంటలు వేశారని దీంట్లో వరి అధికంగా వేసారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి చివరి దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో స్టార్టర్లు, రాగి వైర్లు చోరీకి గురికావడంతో ఆందోళనలో ఉన్నారు. అసలే ఖరీఫ్ సీజన్లో మడి పారుదల అంతంత మాత్రమే. మరలా కొత్త స్టార్టర్లు అమర్చాలంటే రూ.15 వేలు నుండి రూ. 20 వేలు వరకు ఖర్చు అవుతుందని, ఇదంతా సమకూర్చే లోపు పంటలు ఎండిపోతాయని రైతులు బాధను వెళ్లగక్కుతున్నారు. అధిక పెట్టుబడులు వెచ్చించి పంటలు పండిస్తున్న రైతులకు ఇదొక అదనపు భారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇరుగుళం హైస్కూల్‌ను

# సందర్శించిన 'డానియేలి' చైర్మన్

పాఠశాలలో శ్రీసిటీలోని స్టీల్ ఉపకరణాల తయారీ పరిశ్రమ డానియేలి చైర్మన్ మారేస్చి డానియేలి అన్నా

**ప్రజాశక్తి - సత్యవేడు:** శ్రీసిటీలోని స్టీల్ ఉపకరణాల తయారీ పరిశ్రమ డానియేలి చైర్మన్ మారేస్చి డానియేలి అన్నా మంగళవారం ఇరుగుళం జెడ్‌పి హైస్కూల్‌ను సందర్శించారు. శ్రీసిటీ పర్యటనలో భాగంగా ఆమె ఇక్కడకు విచ్చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో స్కూల్లో తమ కంపెనీ చేపట్టిన కార్పొరేట్ సామాజిక భాద్యత (సిఎస్ఆర్) పనులను పరిశీలించారు. తాము కల్పించిన వివిధ సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 2015, 2020 మధ్య డానియేలి కంపెనీ సిఎస్ఆర్ కార్యక్రమాలలో ఇరుగుళం జెడ్‌పి హైస్కూల్‌కు సుమారు 60 లక్షలు వెచ్చించింది. ఇందులో తరగతి గదుల నిర్మాణం, పాఠశాల భవనాల మరమ్మతులు, ఫర్నిచర్ ఏర్పాటు, సబ్‌మెర్సిబుల్ మోటారుతో సహా బోర్‌వెల్ ఏర్పాటు, ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు, ఇరుగులం ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల మరమ్మతులు ఉన్నాయి. పర్యటనకు విచ్చేసిన మారేస్చి డానియేలి అన్నాకు శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి, ఇరుగుళం జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చినబాబు సాదర స్వాగతం పలికారు. ఆమెతో పాటు డానియేలి ఇండియా ఉన్నతాధికారులు అంబ్రోసినో డొమెనికో, సీఓఓ శ్రీనివాస్ రావు, సీఎఫ్ఓ రాజేష్ హిసారియా కుమార్, హెచ్ఆర్ సైమన్ సైజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# విజేతలు క్రీడల్లో సత్తా చాటాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - క్యాంపస్ :** జోనల్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని, విజేతలుగా నిలిచి తమ సత్తా చాటాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఎస్వీ.ఆర్ట్స్ కళాశాలలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్,ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ కప్ " ముగింపు వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో ఛాలెంజ్ గా తీసుకుని తిరుపతి పట్టణంలో ఈనెల 24 తేదీ నుండి 26 తేదీ వరకు మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలు ఒలంపిక్, కామన్వెల్త్ నేషనల్ గేమ్స్ లలో పాల్గొని దేశం గర్వించేలా పథకాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా ప్రాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. గెలుపొందిన వివిధ జోన్లకు చెందిన క్రీడాకారులు, క్రీడాకారిణులకు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్లను అందించారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ వివిధ జోన్ల నుండి అమరావతి చాంపియన్షిప్ పోటీలలో పాల్గొనేందుకు తిరుపతికి విచ్చేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ సంతోష్,శాప్ అధికారి కోటేశ్వరరావు, జిల్లా డిఎస్డివో శశిధర్,జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామలో పర్యావరణ వినాయక విగ్రహ పోటీలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి కరకంబాడి మార్గం లోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం పర్యావరణ వినాయ క విగ్రహ పోటీలను కళాశాల డైరె క్టర్ అరవింద్ కుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. కళాశాల లోని ఈఈఈ, జాతీయ సేవా విభాగం, ఐఐసీ సంయుక్త నిర్వహణలో పర్యావరణ, కాలుష్య రహిత వినాయక విగ్రహ పోటీలలో విద్యార్థులు పాల్గొని, ప్రకృతిలో సహజ సిద్ధంగా దొరికే వివిధ రకాల వస్తువులు, మట్టితో వినాయక ప్రతిమను తయారుచేసి తమ సృజనాత్మకతను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వినాయక ప్రతిమలను డైరెక్టర్ అరవింద్ కుమార్ రెడ్డి పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో

# ముందస్తు వినాయక చవితి సంబరాలు

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరెస్పాండెంట్ విద్యా ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ప్రిన్సిపాల్ మేరీ ఆధ్వర్యంలో ముందస్తుగా వినాయక చవితి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, విఘ్నాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మూడు రోజులు గణపతి పూజలు అందుకోనున్నారని, మూడవ రోజు నిమజ్జనం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

## సచివాలయ ఉద్యోగులకు సన్మానం

**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** వెదురుకుప్పం మండలం కొమరగుంట సచివాలయం పరిధిలో ఇనాంకొత్తూరు పంచాయతీ భవనంలో ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం సర్పంచులు కటారి మమత, ద్రాక్షయణి, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో పురుషోత్తం హాజరయ్యారు. వీరికి శాలువా కప్పి సన్మానం చేశారు. ఎంపిటిసి మునిచంద్రా రెడ్డి, టిడిపి నాయకులు కటారి మోహన్ రెడ్డి, హాజరయ్యారు. వీరి వెంట, సచివాలయ సిబ్బంది, పంచాయతీ పరిధిలోని గ్రామస్తులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కృషితోనే కుప్పంకు కృష్ణాజలాలు

**- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు**

**ప్రజాశక్తి -శాంతిపురం:** రాయలసీమలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసుల దశాబ్దాలనాటి కల సాకారమయిందని హంద్రీ -నీవా ప్రాజెక్ట్ ద్వారా కుప్పం బ్రాంచి కాలువకు కృష్ణానదీ జలాలు కుప్పం నియోజకవర్గంలోకి వచ్చాయని ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే సాధ్యమైందని టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నలుగురు ముఖ్యమంత్రుల వల్ల కాని పనిని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తి చేశారన్నారు. హంద్రీ -నీవా కాలువలను ఆధునికీకరించి 730 కిలోమీటర్ల మేర రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో కృష్ణా జలాలను పారించి, రైతాంగానికి సాగునీరు అందించి భరోసా కల్పించారన్నారు. రాయలసీమ బిడ్డ అని చెప్పుకునే జగన్ రెడ్డి రాయలసీమ ప్రజలకు ఉపయోగపడే హంద్రీ-నీవా కోసం ఐదేళ్ల పాలనలో చేసింది శూన్యం. సొంత కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి దోచుకోవడమే తప్ప చేసిందేమి లేదన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఎస్ఐ

**ప్రజాశక్తి-సోమల:** వినాయక చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న వినాయక విగ్రహాల మండపాల వద్ద నిర్వాహకులు కమిటీ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ శివశంకర్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో హిందూ, ముస్లిం సోదరులను సమావేశపరిచి వినాయక మండపాల వద్ద అధిక శబ్దంతో స్పీకర్లు ఏర్పాటు చేయరాదని ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని రాత్రి పగలు ఎల్లవేళలా మండపాల వద్ద ఒక మనిషిని ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఇదే క్రమంలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని సూచించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటి నుండి నిమజ్జనం వరకు ఎలాంటి సంఘటనలు జరగకుండా ఐకమత్యంగా పండుగ జరుపుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ప్రశాంతంగా మండలంలో చవితి వేడుకలు పూర్తయ్యే విధంగా పోలీసులకు సహకరించాలని అన్నారు.

## వైసిపి దగా డిఎస్సీ.. కూటమి ప్రభుత్వానిది మెగా డీఎస్సీ

**ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో.. కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని విజయవంతంగా నిర్వహించినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఎమ్మెల్యే మంగళవారం చిత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ... నాడు ఐదేళ్ల వైసిపి పాలనలో నిరుద్యోగులు పూర్తిగా దగాపడ్డారని, దగా డిఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహణను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నిర్ణయాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు.

## సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నాగరాజు, శివారెడ్డి

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:**

ఈ నెల23 నుండి 25 వరకు ఒంగోలు జిల్లాలో జరిగిన సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల్లో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ సమక్షంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజును, జిల్లా సహాయ కార్యదర్శి కే.శివారెడ్డిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

## సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాశక్తి-కుప్పం:** సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరిశీలించారు. కుప్పం పరమ సముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా జనాలకు సీఎం దంపతులు జల హారతి ఇచ్చే ప్రాంతాన్ని ఎమ్మెల్సీ పరిశీలించారు. సీఎం బహిరంగ సభ ప్రాంతంతో పాటు పరవసముద్రం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. ఎన్నో ఏళ్లుగా కుప్పం కుప్పం ప్రజలు కృష్ణా జలాల కోసం ఎదురుచూస్తున్నారని అలాంటి క్షణం రానే వచ్చిందని 30న సీఎం చంద్రబాబు దంపతులు జల హారతి ఇచ్చి కృష్ణ జలాలను కుప్పంకు విడుదల చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తో పాటు మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజకుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో చైర్మన్ ప్రతాప్, కాణిపాకం వెంకటేష్ పాల్గొన్నారు.

# కాణిపాకం బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత

## డ్రోన్ కెమెరాలతో నిఘా : ఎస్పి

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** ఈనెల 27 నుండీ సెప్టెంబర్ 16 వరకు నిర్వహించనున్న కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో శాంతి భద్రతలు పరిరక్షణకు ప్రత్యేక డిఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేవాలయం ప్రాంగణం, మండపం, కోనేరు, పార్కింగ్ బస్టాండు ,కళ్యాణ్ కట్ట, పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామని, ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంతర సంఘటనలు జరగకుండా, దేవస్థానం ఆధ్వర్యంలో సీ.సీ.టీ.వీ ల ద్వారా నిరంతర పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడెక్కడ ఏ స్థలాల్లో ఉన్నాయని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఫ్లెక్సీలు, బ్యారికేడ్స్ పటిష్టంగా ఉండాలని తెలిపారు. మా ఆధ్వర్యంలో రెండు డ్రోన్లు కెమెరాలు పనిచేస్తాయని, ఆలయం ఆధ్వర్యంలో రెండు డ్రోన్ కెమెరాలు ఉండాలని తెలిపారు. భక్తులు అప్రమత్తంగా ఉండుటకు మైకు ద్వారా హెచ్చరికలు జారీ చేసేందుకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతూ ఉందని సూచించారు. ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది సహకారంతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతమైన దర్శనం ఏర్పాటు చేయడానికి నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజిద్దాం : మేయర్

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** నగర ప్రజలు పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని నగర మేయర్ ఎస్ అముద పిలుపునిచ్చారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం పర్యావరణ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఎంహెచ్వో డా. పి.లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే వినాయక చవితి పర్వదినాన్ని పర్యావరణహితంగా మట్టితో చేసిన వినాయక విగ్రహాలను వినియోగించాలన్నారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. నగర ప్రజలు వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, మట్టి విగ్రహాలను పూజకు వినియోగించాలని కోరారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి కట్టమంచి చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

**చిత్తూరుఅర్బన్ :** నియోజకవర్గ ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరులో ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి పురస్కరించుకొని ప్రజలు పర్యావరణ హితమైన.. ప్రకతికి దగ్గరైన మట్టితో చేసిన వినాయక స్వామి వారి విగ్రహాలను పూజించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, హానికర రంగులతో కూడిన విగ్రహాలను పూజకు వినియోగించవద్దని, వీటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా జలచరాలతో పాటు, పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు.

# 30న స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ: తహశీల్దారు

**ప్రజాశక్తి-కుప్పం :**

సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ నెల 30వ తేదీ కుప్పంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తహశీల్దారు చిట్టిబాబు మంగళవారం తెలిపారు. కుప్పం మండలానికి సంబంధించి 38 వేల స్మార్ట్ రేషన్ కార్డులు ఇప్పటికే తహశీల్దారు కార్యాలయానికి చేరాయని ఈనెల 30న సీఎం చంద్రబాబు కుప్పం పట్టణ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయాల వారీగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తామన్నారు. ఆధునిక టెక్నాలజీతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్

కార్డులు ఎంతో బాగున్నాయని ఆయన పేర్కొన్నారు. కుప్పం మండ లానికి సంబంధించి దాదాపు అన్ని స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చినట్లేనని తెలిపారు.

## మంగళపల్లి పాఠశాలకు 'యుఎస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్' అవార్డు

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళ విద్యా వాణి మాస పత్రిక నడుపుతున్నందుకు యూఎస్ఏ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. ఈ సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే కలిగిరి మురళీమోహన్ చేతుల మీదుగా మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి , పూర్వ ప్రధాన ఉపాధ్యాయురాలు ఏపీ లలిత, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, గణిత అవధాని హెచ్ అరుణ శివప్రసాద్ పాఠశాల సిబ్బంది ఈ అవార్డును అందుకున్నారు. మాస పత్రిక దాత ధరణి ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాస పత్రిక అవసరమయ్యే ఖర్చును తనే భరిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలో 35 సంచికలను విడుదల చేసిన సందర్భంగా యూఎస్ఏ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిందని

అవార్డును అందిస్తున్న ఎమ్మెల్యే కలిగిరి మురళీమోహన్

ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఒక పాఠశాల కృషిని గుర్తించి ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లారప్ప , భారతి , రవీంద్రారెడ్డి , రమాదేవి , అమరనాథ్ రెడ్డి ,జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పాపు దేశ జయంతి ,సుధాకర్ ,విజయ్ ,హరీష్ పాల్గొన్నారు.

## రేపు డిఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** ఉపాధ్యాయ నియామకం కోసం ప్రభుత్వం నిర్వహించిన డియస్సీ 2025 అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 28వ తేది శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ముత్తురేవుల, అపోలో విశ్వవిద్యాలయం మురకంబట్టులో నిర్వహించ నున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి వరలక్ష్మి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. టీముల వారీగా పరిశీలన కోసం వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల, అపోలో యూనివర్సిలకు అభ్యర్థులు తమ లాగిన్‌లో సబంధిత వెబ్‌సైటు ద్వారా వెరిఫికేషన్ కాల్ లెటర్‌ను డోన్‌లోడ్ చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు 5 పాస్‌పోర్టు ఫోటోలతో పరిశీనకు హాజరుకావాలని కోరారు. ముందే తప్పనిసరిగా సర్టిఫికెట్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకొని సబంధిత పత్రాలన్నీ ( అటెస్టెడ్ 3 సెంట్స్) ఒక ఫోల్డర్ నందు భద్రపరిచి ఫోల్డర్ పైన హాల్ టికెట్ నెంబరు పేరు రాసి సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా విద్యాశాఖ, రెవిన్యూ అధికారులు, దాదాపుగా 110 మంది 36 టీమలు ఏర్పాటు చేశారు. 15 టీమలు అపోలో యూనిర్శిటి నందు, 15 టీమలు శ్రీ వెంకటేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల నందు వెరిఫికేషన్ నిర్వమించనున్నారు. అభ్యర్థుల వయసు , అర్హతలకు సంబంధించిన కుల ధృవీకరణ పత్రాలతో పాటు అవసరమైన ఒరిజినల్ పత్రాలను తప్పనిసరిగా తమ వెంట తెచ్చుకోవాలి. అభ్యర్థులు తప్పుడు ధ్రువపత్రాలు సమరించిన్నట్లు గుర్తిస్తే అలాంటి అభ్యర్థులపై క్రమినల్ చర్యలు తీసుకోనున్నారు.

## బృందావన్‌లో వినాయక చవితి పూజలు

**ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:** బందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో వినాయక చవితి కార్యక్రమం పాఠశాల వ్యవస్థాపకులు శైలజ, పాఠశాల డైరెక్టర్ ప్రియా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమంతో ప్రారంభమై, పాఠశాలలో చదవకునే విద్యార్థులు గణనాథునిపై విభిన్న నత్యాలను, ప్రదర్శించారు. భక్తి పాటలను ఆలపించారు. వినాయక చవితి ముందస్తు పూజా కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. తెలుగు పండుగల విశిష్టతను పిల్లలకు వివరించి చెప్పడం, విద్యార్థులను ఉపాధ్యాయులను కార్యక్రమం జయప్రదం చేసిన ప్రతి ఒక్కరిని పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు. పిల్లలు ఆకులతో పుష్పాలతో వివిధ రూపాలలో వినాయక ప్రతిమలను తయారుచేశారు.

## వ్యాధుల నిర్మూలనకు చేపలు విడుదల

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** కీటకజనిత వ్యాధుల నిర్మూలనకు గంభూషియ చేపలను చిత్తూరు నడి బొడ్డున గల గంగినేని చెరువులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి , చిత్తూరు నగరపాలక మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంహెచ్ఒ డాక్టర్ లోకేష్ మంగళవారం వదిలారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ కీటక జానీత వ్యాధులైన మలేరియా, డెంగీ ,చికెన్ గున్యా ,ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రాకుండా ఉండడానికి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమ లార్వాలు పెరిగి దోమలుగా తయారై పై వ్యాధులను కలుగజేస్తున్నాయని, ఈ గంభూషియా చేపలు లార్వాలను తిని దోమ పెరుగుదలను నివారిస్తాయి. అలాగే చిత్తూరు నగర సరిహద్దుల లోపల నీటి గుంటలలో సుమారు లక్ష గంభూసియ చేపలను ఈరోజు విడుదల చేశామన్నారు. ప్రజలు తప్పనిసరి జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలని ఫ్రైడే డ్రైడే పాటించాలని , దోమతెరలు వాడాలని ,సాయంకాలం పూట పచ్చివేపాకు పొగ వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ , డెమో జయరాముడు, సభ్ యూనిట్ అధికారి రామకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మాట ప్రకారం మెగా డీఎస్సీ: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పలమనేరు:** యువతకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించిందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇక ప్రతి ఏటా మెగా డీఎస్సీని నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామన్నారు. దీంతో ఎస్సి, ఎస్టి, బీసీ, ఈడబ్ల్యూఎస్, వికలాంగ అభ్యర్థులకు వయసు మినహాయింపు ఇచ్చి వారికి అండగా నిల బడ్డామన్నారు. యువత బాగుపడటం ఇష్టం లేని జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించారని వాటిని అధిగమించి మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత విద్యాశాఖ మంత్రి లోకేష్ కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు నూతన వెలుగులు తెస్తున్నారని లోకేష్‌ను కొనియాడారు. చంద్రబాబు తన 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో దాదాపు 13 డీఎస్సీలు నిర్వహించి లక్ష ఎనభై వేలకు పైగా పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల లో అధిక శాతం ఆయన హయాంలో ఉద్యోగాలు పొందిన వారే అన్నారు. అయితే 2019 ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ ఇస్తానని మాట ఇచ్చిన జగన్ రెడ్డి గత ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులను మోసం చేశాడన్నారు.

## ముందస్తు వినాయక చవితి వేడుకలు

**ప్రజాశక్తి- సోమల:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం వినాయక చవితి పండుగ సందర్భం గా మంగళవారం ముందస్తు వినాయ క చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గట్టు వారి పల్లి, నెల్లిమంద పలు పాఠశాలలో వినాయకుడి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటుచేసి అలంకరించి పూజలు నిర్వహించి పిల్లలకు పప్పు బెల్లం ప్రసాదంగా పంచిపెట్టారు. విద్యార్థులు ఉత్సాహంగా ముందస్తు చవితి వేడుకలలో పాల్గొని గణనాథుడికి మొక్కులు మొక్కారు.

**వెదురుకుప్పం:** మండలంలోని డాక్టర్ వైయస్సార్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షిస్తూ వినాయక చవితిని నిర్వహించు కోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణ శారద పిలుపు నిచ్చారు. మంగళవారం వారు మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు మట్టితో తయారుచేసిన విగ్రహాలను, పూజా విధానాలకు ఉపయోగించాలని పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని, విద్యార్థు లందరూ వారి వారి గ్రామాల్లో మట్టి విగ్రహాలకు ప్రాముఖ్యత నివ్వా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ సి గౌరీ , ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## హథీరామ్ బావాజీ మఠం కూల్చివేత కుట్ర

- భాస్కర్ నాయక్

**ప్రజాశక్తి-కుప్పం:** తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రియ భక్తుడు హథీరామ్ బావాజీ మఠం కూల్చివేసేందుకు కుట్ర పన్నుతున్నారని గిరిజన కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ నాయక్ ఆరోపిం చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో వేలాది ఎకరాల భూములు భవనాలపై కన్నేసిన కూట మి ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత కలిగిన భవనాలను కూల్చివేయడమేనా సనాతన ధర్మం అంటూ ప్రశ్నించారు. మఠం ఆస్తులు జోలికి ఎవరొచ్చిన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. హథీరామ్ బావాజీ మఠం కూల్చివేసే కుట్ర గిరిజనుల సంస్కృతి పై దాడి చేయడమేనని పేర్కొన్నారు. మఠం భూముల జోలికి ఎవరు వచ్చినా చరిత్రహీనులుగా మిగిలి పోతారని దీనిపై ఎలాంటి పోరాటానికైనా గిరిజనులు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

### ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు పొందాలి

**ప్రజాశక్తి-పలమనేరు:** డిగ్రీ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు పొందాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పలమనేరు శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ 18వ తేదీ నుండి ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు ఈ అడ్మిషన్ల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాలలో బిఎ, (రాజనీతి శాస్త్రం ఉర్దూ) బీకాం, బీకాం కంప్యూటర్స్ బి బిఏ, బీఎస్సీ, (రసాయన శాస్త్రం, మ్యాథ్స్, భౌతిక శాస్త్రం, జువాలజీ, వృక్ష శాస్త్రం )బి – ఒకేషనల్ హార్టికల్చర్, డి ఎ హెచ్, తదితర కోర్సులు ఉన్నట్లు తెలిపారు. కళాశాలలో కార్పొరేట్ కళాశాలల కంటే మెరుగైన సదుపాయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే అడ్మిషన్లు పొందాలని తెలిపారు. సందేహాల నివృత్తికి బిఎ 9441914067, బీకాం, బిబిఏ 9493572319, బీఎస్సీ 7989886970 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఇది హౌసింగ్ కార్యాలయమేనా?

- బోర్డుపై కనిపించని అక్షరాలు
- వెతుకులాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో వెదురుకుప్పం మండలంలో హౌసింగ్ కార్యాలయం వుంది. ఇది తహశీల్దారు కార్యాలయానికి పక్కనే ఆనుకొని వుంది. ఎవరైనా తెలియని వారు వస్తే గృహ నిర్మాణ శాఖ కార్యా లయం ఇదేనా అని ఆశ్చర్య పోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాన్ని గుర్తించడానికి చూచికకు ముందు భాగంలో పేర్లు రాస్తారు. అయితే గృహ నిర్మాణ శాఖ కార్యా లయానికి ముందు భాగంలో రాసిన పేరు ఉన్న అక్షరాలు రోజురోజుకు కనిపించ కుండా పోతున్నాయి. దీంతో ఎవరైనా ప్రజలు అక్కడికి వెళితే హౌసింగ్ కార్యా లయం ఎక్కడ వుందో వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని సంవత్సరాల క్రితం ఈ హౌసింగ్ కార్యాలయానికి పేరు రాశారు. కాల క్రమంలో వచ్చిన అధికారు లెవరూ ఈ కార్యాలయం బాగోగులు చూసుకునే నాథుడే లేదని స్థానికులు వాపోతున్నారు. వచ్చిన అధికారులు వారి పని వారు చూసుకుని వెళ్లిపోతున్నారు. కార్యాలయం అభివృద్ధికి కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ కార్యాలయం పరిస్థితి ఇలా ఉంటే ఇక అధికారి పనితీరు ఎలా ఉంటుందోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో 25 పంచా యతీలకు సంబం ధించి ఈ కార్యా లయం నుంచి గృహ నిర్మాణ లావా దేవీలు నిర్వహిస్తారు. కార్యాలయాన్ని ఇలా వది లేయడం అన్యాయమని ఇక్కడికి వచ్చిన వారు వాపోతు న్నారు. సంబం ధిత అధికారులు ఈ కార్యాలయం చుట్టూ శు భ్రం చేసుకుని ముందు భాగంలో పేరును అందరికీ కనిపించేలా రాయాలని కోరుతున్నారు.

అక్షరాలు కనిపించని హౌసింగ్ కార్యాలయం

## సీసీ రోడ్డు ప్రారంభం

**ప్రజాశక్తి- ఐరాల:** ఐరాల మండలం, నాంపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాంపల్లెకు చేరుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్‌కు స్థానిక నాయకులు పూలమాలలు, దుశ్శాలువతో సత్కరించగా, మహిళలు మంగళ హారతులు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం సీసీ రోడ్డును ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం నాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఆరా తీశారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, పూతల పట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కో ఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారు పాలెం మార్కెట్ యార్డ్ చైర్మన్ భాస్కర్ నాయుడు, ఐరాల జడ్పిటిసి సుచిత్ర కన్నయ్య నాయుడు, ఎంపీపీ మోహన్, కాణిపాకం దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు, యాదమరి సింగిల్ విండో చైర్మన్ చిత్రానాయుడు, ఐరాల సింగిల్ విండో చైర్మన్ శేషాద్రి నాయుడు, నాంపల్లి సర్పంచ్ స్వర్ణ, ఎంపీటీసీ మమత, మాజీ జెడ్పిటిసి లతా బాబు నాయుడు పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ లక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అటెండెన్స్, ఓపి రిజిస్టర్, ఫార్మసీ, ల్యాబ్ కార్యకలాపాలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ రికార్డులు, ఐసి రిజిస్టర్లు వంటి పలు విభాగాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమావేశమై పనితీరుపై సమీక్షించారు. సిహెచ్ఓ జయంతి, సూపరువైజర్ రెడ్డమ్మ, ఫార్మాసిస్ట్‌తో పాటూ ల్యాబ్ టెక్నీషియన్ జిల్లానిబాష, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రిలకు పలు సూచనలు చేశారు. సేవల నాణ్యత మెరుగుపరచాలని, ప్రజలకు అందించే ఆరోగ్య సదుపాయాలు మరింత సమర్థవంతంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి రోగిని శ్రద్ధగా చూసుకోవాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం మీద ప్రజలకు నమ్మకం పెరిగేలా సేవలు అందించాలని అధికారిణి ఆదేశించారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారిణి లక్ష్మి

## బాల్య వివాహాలపై అవగాహన అవసరం

-జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ భారతి

**ప్రజాశక్తి -కార్వేటినగరం :** బాల్య వివాహాలపై ప్రతి విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి చిత్తూరు ఎంఎస్ భారతి అన్నారు. మంగళవారం కార్వేటినగరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హెచ్ఎం మర్రి శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 18 సంవత్సరాలు లోపు వివాహాలు చేసుకోకూడదని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాల సమాచారం తెలిస్తే పోలీసులకు, ఐసిడిఎస్ శాఖ అధికారులు,లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1098 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. చిన్న వయసులో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత తల్లిదండ్రులు చెప్పిన తర్వాత పెళ్లి చేసుకోవా లని పిలుపు నిచ్చారు.

కార్వేటినగరంలోని చాకలవాని గుంట ఎస్టి కాలనీలో ప్రజలకు బాల్య వివాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి ఉద్యోగాలు చేసిన తర్వాత పెళ్లి చేసుకుంటే భవిష్యత్ బాగుంటుందని వైసిడిఎస్ అధికారిణి, మండల వైద్యాధి. కారిణి, ఎంపీడీవో, ఎంఈఓ పేర్కొన్నారు. న్యాయమూర్తి గురించి అధ్యాపకులు రవి చక్కగా కవిత రూపంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎస్ మూర్తి, సిడిపిఓ శోభారాణి ఎంపీడీవో చంద్రమౌళి మండల వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి హెచ్ ఎం శేఖర్, ఎంఈఓ లు విజయ్ కుమార్, మనోజ్ కుమార్, తహశీల్దార్ నాగరాజు పాఠశాల ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

## జీవో1793ను రద్దు చేయాలి

- కాపు సంఘ జాతీయ నాయకుడు గోపి రాయల్

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :** బలిజ కులస్తుల సున్నిత భావాలు ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా దొమ్మర కులాన్ని గిరి బలిజ కులంగా నియమించే జీవో నెంబర్ 793ను రద్దు చేయాలని జాతీయ కాపు సంఘ ప్రచార కార్యదర్శి గోపి రాయల్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం చిత్తూరు పార్లమెంట్ కాపు సంఘ కార్యదర్శి అల్లాల విజయబాబు ఆధ్వర్యంలో శ్రీరంగరాజపురం తహశీల్దారు లోకనాథ్ పిళ్ళైకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా కాపు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న కాపు కులంలో దొమ్మర కులాలు కలపడం సరికాదని దీనికి తోడు వీరిని గిరి బలిజ గా గుర్తించడం సమంజసం కాదన్నారు. తాము ఏ కులానికి వ్యతిరేకం కాదని అన్ని కులాల పై తమకు గౌరవభావం ఉందని అయితే తమ కులంలో వీటిని కలపడం సమంజసం కాదని ఈ విషయాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. జీవో ని రద్దు చేయకపోతే జిల్లా స్థాయి ఆపై రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు. తాను ఇచ్చిన వివరణ కలెక్టరేట్ సమర్పించాలని పై అధికారులకు పంపాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మాజీ సర్పంచ్ చిత్తూరు పార్లమెంట్ కాపు సంఘ ప్రధాన కార్యదర్శి అల్లాల విజయబాబు, తిరుపతి జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీరామ్ గోపి రాయల్, ఎస్ఆర్ పురం బలిజ సంఘం నాయకులు వెంకటేష్ పుల్లూరు. సుబ్బానాయుడు, చంద్ర ,వీర రాఘవులు, బాబు, మునస్వామి పలువురు బలిజ కులం సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడలు నిర్వహిస్తున్న దృశ్యం

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాశక్తి- కార్వేటినగరం :**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎంపురం ఉన్నతపాఠశాల హెచ్ఎం నాథముని రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థి బాల్య దశ నుండే క్రీడలలో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని వ్యాయామ సంచాలకులు కిషోర్ కుమార్ ఆకాంక్షిం చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవం, మాతృ భాష దినోత్సవం ప్రత్యేక కార్యక్రమాలు వుంటాయని విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలని హెచ్ఎం నాథముని రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు సరస్వతి, మాలతి, కలై వాణి, వ్యాయామ సంచాలకులు కిషోర్ కుమార్, ఢిల్లీ బాబు, రంజిత్ కుమార్, రాములు, హరి ప్రకాష్ పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవలపై తనిఖీ

**ప్రజాశక్తి-పెద్దపంజాణి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న వైద్య సేవలను మండల స్పెషల్ ఆఫీసర్ జె మురళీకృష్ణ రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారిణి మాధవిని అడిగి తెలుసుకుని ఓపి అన్ని రకాల పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలిం చారు. రాయల పేట అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పిల్లలకు పౌష్టిక ఆహార వివరాలను, తల్లులకు అందిస్తున్న ఆహార వివరాలను అడిగి తెలుసుకుని పిల్లల హాజరు నమోదు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి హేమలత, అగ్రికల్చర్ అసిస్టెంట్ అనిల్, పంచాయతీ కార్యదర్శులు రెడ్డి శేఖర్, శశికళ పాల్గొన్నారు.

బురద తొలగించక పూర్వం..

గ్రావెల్ తోలిన అనంతరం..

## బురద తొలగింపు

### పారిశుద్ధ్య లోపం వార్తపై స్పందన

**ప్రజాశక్తి -విజయపురం (నగరి):** నగరి మండలంలో 'పారిశుద్ధ్య లోపం.. వ్యాధుల భయం' అనే శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు మాంగాడు పంచాయతీ కార్యదర్శి స్పందించి బురద మయంగా ఉన్న రోడ్డును మంగళవారం గ్రావెల్ తోలి పారిశుద్ధ్యం మెరుగు పరిచారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు పంపిణీ

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా, వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మంగళవారం తిరుపతిలో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుపతి పర్యావరణ ఇంజనీర్ సిహెచ్ రాజశేఖర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యులు నగలపాటి నాగేశ్వరరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలన్నారు. ఎటువంటి ప్లాస్టరాఫ్ పారిస్, ఇతర రసాయనాలతో తయారుచేసిన విగ్రహాల వాడకాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 4 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'కౌటిల్య'చే ఇండక్షన్ కార్యక్రమానికి శిక్షణ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతి ఎస్.వి. యూని వర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ (ఎస్.వి. యూ.సి.ఈ.) లో బి.టెక్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్‌లు పొందిన నూతన విద్యార్థులకు 'ఓరియెంటేషన్, ఇండక్షన్ కార్యక్రమం మంగళ వారం కౌటిల్య ఇన్స్టిట్యూషన్ ఆధ్వర్యంలో ఎంప్లోయబిలిటీ (ఉద్యోగ సామ్యార్థ నైపుణ్యాలు) లైఫ్ స్కిల్స్ పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి శిక్షకులగా హాజర య్యారు. ఈ సందర్భంగా కౌటిల్య కంపెనీ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ బిటెక్ విద్యార్థులు ఈ నాలుగు సంవత్సరాల అకడమిక్ విద్య మీ కెరీర్ లో చాలా విలువైనదని తెలిపారు. జాబ్ మార్కెట్‌లో అనేక కొత్త మార్పులు వస్తున్న తరుణంలో వాటికి తగ్గట్లు మీ నైపుణ్యాన్ని పెంపెందించు కోవాలన్నారు. కృత్రిమ మేధ ను మించిన ఆలోచన శక్తిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఇలాంటి తరుణంలో మీరు దృష్టి పెట్టాల్సిన నైపుణ్యాలు - తార్కిక ఆలోచన (లాజిక్) తో కూడిన పరిజ్ఞానంతో పాటు కంపెనీలకు కావాల్సిన సాఫ్ట్ స్కిల్స్ పై గురి పెట్టాలని సూచించారు. బిటెక్ పూర్తి కాగానే మీరు అనుకొన్న లక్ష్యం చేరాలంటే ఈ నాలుగు సంవత్సరాలు పక్కా ప్రణాళిక అవసరమని అప్రమత్తం చేశారు. కాలేజీలోని మీ గురువులే మీకు మంచి స్నేహితులని చెప్పారు. అంతే తప్ప పరిచయం లేని సోషల్ మీడియాలో కొత్త స్నేహాలు మీకు అవసరం లేదని హితవు పలికారు. గొప్ప లక్ష్యాలు పెట్టుకొని, వాటి సాధనకు సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లి, కాలేజీ గర్వపడే విజయాలు సొంతం చేసుకోవా లన్నారు. కౌటిల్య, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ఇండియాలో దాదాపు 30 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు అరథమెటిక్, రీజనింగ్ , ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జి అనే 4 సబ్జక్ట్స్‌తో ఒకటే కామన్ సిలబస్ వుందన్నారు. కావున ఖాళీ సమయంలో అకడమిక్ చదువుతో పాటు, ప్రభుత్వ పోటీ పరీక్షలకు కూడా లక్ష్యంగా పెట్టొకోవాలన్నారు. దీనిలో ప్రభుత్వ బ్యాంకు పరీక్షలు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే బోర్డు తదితర రిక్రూట్మెంట్స్ భాగంగా వున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్– ప్రొఫెసర్ జి.శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ – ప్రొఫెసర్ సి.హెచ్.డి.వి.సుబ్బారావు, కార్యక్రమ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మునిలక్ష్మి, డీన్, డైరెక్టర్, ప్లేసెమెంట్ ఆఫీసర్ మరియు అన్ని విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.




# కన్యాకుమారి చిత్రాన్ని ఆదరించండి: ఆర్కాట్ కృష్ణ ప్రసాద్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** పల్లెటూరి వాతావరణంలో చిగురించిన ప్రేమకథ చిత్రం కన్యాకుమారి చిత్రాన్ని ప్రేక్షకులు అందరూ ఆదరించాలని లైన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఈ చిత్రానికి సంబంధించిన గోడపత్రికలను చిత్ర యూనిట్ సభ్యులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు చత్రపతి వేణుగోపాల్, హరినాథ్, బెల్లంకొండ సురేష్, లైన్స్ క్లబ్ ప్రతినిధులు రామచంద్ర రెడ్డి, సోమయ్య, జగన్నాథం, ఆముదాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుడ్లూరు జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** ఎంజీఎం గ్రూపు సంస్థల చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున్ నాయుడు 68వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంజీఎం హాస్పిటల్‌లో తిరుపతి ఎస్వీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. తన పుట్టినరోజులను పురస్కరించుకొని ఇప్పటికి 26సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. మల్లికార్జున నాయుడుకు పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి జిల్లా ప్రజలకు వినాయక చవితి సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆది దేవుడైన వినాయకుడు విఘ్నాలను తొలగించి జిల్లా ప్రజలకు మంచి చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉత్సవాలు నిర్వహించుకో వాలని, మట్టి గణపతిని పూజించాలని కోరారు.

## ఏపిఆర్ సెట్ కన్వీనర్‌గా ఆచార్య సురేంద్రబాబు

**ప్రజాశక్తి - క్యాంపస్** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గ్రంథాలయ అధికారి ఆచార్య కె. సురేంద్రబాబును ఏపిఆర్ సెట్-2024 కన్వీనర్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి నియమించారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను వీరు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు పిహెచ్.డి లో చేరడానికి ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారు. గత సంవత్సరం కూడా ఏపిఆర్ సెట్ ను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించి, అడ్మిషన్లు చేపట్టింది. నియామక పత్రాన్ని ఈ రోజు యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు అందజేశారు. వీరు ప్రస్తుతం పరీక్షల విభాగానికి డీన్ గా వ్యవహరిస్తున్నారు.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సామాన్యుడిని ఆలోచింపజేసే దినపత్రిక, విజ్ఞానం, వివేకం, వికాసం పెంచే ప్రజాశక్తి ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో ప్రతి ఉదయాన్నే ప్రజలను పలకరించే దినపత్రిక నేడు 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు
కె.రవీంద్ర కుమార్
ఉపఖజానా కార్యాలయం,
వాకాడు మండలం

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రమజీవుల పత్రిక, కార్మిక, కర్షక, ఉద్యోగుల అభిమాన పత్రిక ప్రజాశక్తి నిజాన్ని నిర్భయంగా రాస్తూ ... ప్రజల పక్షాన నిలిచి నేడు 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా పాఠకులకు, సిబ్బందికి, విలేకరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
గజేంద్ర బాబు, వార్డెన్
బి.సి. హాస్టల్, కోట & ఇంచార్జ్ చిట్టేడు, నెల్లూరు కొత్తపాలెం.
రవి, వార్డెన్
యస్.సి. బాలుర హాస్టల్, చిట్టేడు
పద్మజ, వార్డెన్,
ఎస్సీ బాలికల హాస్టల్, చిట్టేడు
సి.డి.పి.ఓ. మునికుమారి
ఎఫ్ఎసి, బాలసదన్ బాలికల వసతి గృహం, కోట.
టి.ఉషారాణి, వార్డెన్,
ఎస్సీ బాలికల హాస్టల్, కోట
శైలజ, వార్డెన్,
బి.సి. బాలికల వసతిగృహం, కోట

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం వార్తా కథనాలను వ్రాస్తూ... నిజాలను నిర్భయంగా వ్రాసే పత్రిక ప్రజాశక్తి దినపత్రిక నేడు 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా ప్రజాశక్తి పాఠకులకు, సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఇవే మా శుభాకాంక్షలు.
పి. హేమంత్ కుమార్, ఎఇ,
ఆర్‌డబ్ల్యుఎస్, గూడూరు.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సి. శ్రీనివాసులు
యంపిడిఓ, వాకాడు.

ఉమామహేశ్వరరావు
ఇఓపిఆర్‌డి, వాకాడు.
ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో అక్షరమే ఆయుధంగా ప్రగతి పథంలో పయనిస్తున్న దినపత్రిక ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు, సిబ్బందికి ఇవే మా శుభాకాంక్షలు
పంచాయతి కార్యదర్శులు
ప్రవల్లిక, పంచాయతీ కార్యదర్శి, వాకాడు
Ch.సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, కల్లూరు
శివకుమారి, పంచాయతీ కార్యదర్శి, కొండూరు
అర్చన, పంచాయతీ కార్యదర్శి, రాయిగుంటపాళెం
వరలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి, ముట్టెంబాక
శిరిష, పంచాయతీ కార్యదర్శి, కొండాపురం
తోట మధు, పంచాయతీ కార్యదర్శి, జువ్వినట్టు
వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి, తిరుమూరు
రమేష్, పంచాయతీ కార్యదర్శి, బాలిరెడ్డిపాళెం
పి. రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి, యరగాటిపల్లి
ఎస్. చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి, జమీన్ కొత్తపాలెం
ఎర్రబోతు సురేష్, పంచాయతీ కార్యదర్శి, రెడ్డిపాళెం బిట్ -2
మల్లిఖార్జున, నెల్లిపూడి, వాకాడు.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సామాన్యుడిని ఆలోచింపజేసే దినపత్రిక, విజ్ఞానం, వివేకం, వికాసం పెంచే ప్రజాశక్తి ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో ప్రతి ఉదయాన్నే ప్రజలను పలకరించే దినపత్రిక నేడు 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రొ॥ రాఘవ
యస్.వి.యస్.గార్డెన్
దాబా & రెస్టారెంట్
విద్యానగర్, కోట మండలం

ప్రొ॥ గోదావరి
ఒరిస్సా డాబా
ఫ్యామిలీ రెస్టారెంట్, విద్యానగర్,
కోట మండలం

యం. భార్గవి, తహశీల్దార్,
ఏర్పేడు మండలం

సుబ్రమణ్యం
ఆర్.ఐ, ఏర్పేడు మండలం
ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ మరియు వినాయకచవితి శుభాకాంక్షలు
శ్రమజీవుల పత్రిక, కార్మిక, కర్షక, ఉద్యోగుల అభిమాన పత్రిక ప్రజాశక్తి, నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల పక్షాన నిలిచి నేడు 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా పాఠకులకు, సిబ్బందికి, విలేకరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు

ఆర్. నాగరాజు
పాపానాయుడుపేట వి.ఆర్.ఓ
తిరుపతి జిల్లా వి.ఆర్.ఓ. సంఘం అధ్యక్షులు

భాస్కర్
ముసలిపేడు వి.ఆర్.ఓ
తిరుపతి జిల్లా వి.ఆర్.ఓ. సంఘం ఉపాధ్యక్షులు

యన్. మణి
బండారుపల్లి వి.ఆర్.ఓ
ఏర్పేడు మండలం వి.ఆర్.ఓ. సంఘం అధ్యక్షులు

డి.రామ్మూర్తి
మేర్లపాక వి.ఆర్.ఓ

మునస్వామి
చిందేపల్లి వి.ఆర్.ఓ

బి.వాసయ్య
ఏర్పేడు వి.ఆర్.ఓ

యన్.వెంకన్న నాయుడు
కోబాక వి.ఆర్.ఓ

సుబ్రమణ్యం
పంగూరు వి.ఆర్.ఓ

సి.బాబు
మాదమాల వి.ఆర్.ఓ

యస్.హరికృష్ణ
ఆర్.వి.కండ్రిగ వి.ఆర్.ఓ

పి.లోకేష్
యం.డి.పుత్తూరు వి.ఆర్.ఓ

జి.ప్రశాంత్
చిల్లూరు వి.ఆర్.ఓ
దినేష్
పల్లం వి.ఆర్.ఓ
యన్. తులసమ్మ
కందాడు వి.ఆర్.ఓ
శ్రీ విద్య
అంజమేడు వి.ఆర్.ఓ
చంద్రశేఖర్
వికృతమాల వి.ఆర్.ఓ

# దళితుడికిచ్చిన హామీ నెరవేర్చాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: దళిత సంఘాల నేతలు మంగళవారం వెంకటగిరి తహశీల్దార్‌ని కలిసి దళితుడికి గతంలో హామీ ఇచ్చినట్టు రెండు ఎకరాల భూమి మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. గత సంవత్సరం పోలేరమ్మ జాతరలో చెంచు కుమార్ అనే దళితుడిని పోలీసులు కొట్టి గాయపరచారని, అప్పుడు వివిధ సంఘాల వారు నిరసన తెలుపగా అప్పటి ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు నచ్చచెప్పి బాధితుడికి భూమి ఇప్పిస్తామని, కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ సంవత్సర కాల గడిచిపోయినా ఆ హామీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడికి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన తహశీల్దార్ నరసింహారావు, వెంకటగిరి సిఐ ఏవి రమణలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని, సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత కళాకారుడు చెంచు కృష్ణయ్య, దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు మణి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు పొందవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ జిల్లా ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ రావు తెలిపారు. మంగళవారం పుత్తూరు మండలం, అమరం కండ్రిగ గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. వరి, వేరుశనగ, మామిడి పంటలో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. వ్యవసాయ అధికారి ఎస్. కోదండయ్య మాటాడుతూ అన్నదాత సుఖీభవ, పి.ఎం కిసాన్, వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన జిల్లా ఏరువాక కేంద్రం,(డాట్ సెంటర్) కోఆర్డినేటర్ అండ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, డా. రామకృష్ణారావు, మండల వ్యవసాయ అధికారి, పుత్తూరు, ఎస్.కోదండయ్య, రైతు సేవా కేంద్రం, అమరం కండ్రిగ, వి.హెచ్.ఎ.లు ప్రియాంక, మునెమ్మ, రైతులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ఎ.రామకృష్ణారావు మాట్లాడుతూ రైతులకు అడవి పందుల యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు.

## డిఇవై లోకేష్ బాధ్యతల స్వీకరణ




ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక మున్సిపాలిటీలో డిఈవైగా లోకేష్ మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పుత్తూరు మున్సిపాలిటీలో డిఈ గా పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి పదోన్నతిపై చిత్తూరు కార్పొరేషన్‌కి బదిలీ కావడంతో, చిత్తూరు మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో ఏఈఈ పనిచేస్తున్న లోకేష్ పుత్తూరుకు బదిలీపై వచ్చారు. ఆయనకు మున్సిపల్ ఏఈలు, మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రమేష్, కార్తీక్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు సృజనాత్మక భాషా పోటీలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఈ నెల 29వ తేదీన వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని జరుపుకునే తెలుగు భాషా దినోత్సవాన్ని దృష్టి ఉంచుకుని, మంగళవారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్యపఠన, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలను తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యువశ్రీ మురళి మాట్లాడుతూ పోటీల విజేతలకు తెలుగు భాషా దినోత్సవం రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

## ఆదిశంకరకు యూనివర్సిటీ హోదా

యూని వర్సిటీ చాన్సలర్ వంకి అరవింద

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ హోదా వచ్చిందని, ఇది ఎంతో గర్వకారణంగా భావిస్తున్నామని యూనివర్సిటీ చాన్సలర్ వంకి అరవింద వెల్లడించారు. గూడూరు, ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందిందని, ఇప్పుడు కళాశాలకే యూనివర్సిటీ హోదా లభించిందని ఈ సంవత్సరం ఆదిశంకరాలో చేరే వారికి ఆదిశంకర యూనివర్సిటీగా సర్టిఫికెట్లు వస్తాయని వెల్లడించారు. ఈ సమావేశంలో డీమ్డ్ టూ బి యూనివర్సిటీ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

## అందరికీ చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సులోచన రాణి పేర్కొన్నారు. గూడూరు మండల పరిధి, చెన్నూరు, మొదటి హరిజన వాడలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులతో కలిసి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం చట్టపరమైన హక్కులు, సామాజిక సమస్యలు నివారణ చర్యలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో బి.రాజేష్ సీనియర్ సివిల్ జడ్జి, కోటేశ్వర రావు, రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, అట్రాసిటీ మెంబర్స్ అరవ పార్వతయ్య, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## మధురమైనది తెలుగు భాష

ప్రజాశక్తి - రామచంద్రపురం : మకరందం కన్నా మధురమైనది తెలుగు భాష అని, తెలుగు భాష విశిష్టతను పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు సునీత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని, కమ్మ కండ్రిగ, చేకూరి నాగమ నాయుడు ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో గిడుగు రామమూర్తి పంతులు జయంతి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు తెలుగు భాష విశిష్టతపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టిఏ) జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ పరభాషా వ్యామోహంలోపడి తెలుగు భాషను విస్మరించరాదన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 29 తెలుగు భాషా దినోత్సవం రోజున బహుమతులను హెచ్ఎం చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోపాధ్యాయులు విశ్వనాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మత్తులు

ప్రజాశక్తి-ఏర్పేడు: వికృతమాల పంచాయితీ టిసియల్ కంపెనీ సర్కిల్ నుండి పాపానాయుడుపేట వరకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మరమ్మత్తులు చేపట్టాలని ఇటీవల సిపిఐ నాయకులతో కలిసి స్థానికులు చేసిన పోరాటానికి అధికారులు స్పందించారు. మంగళవారం రోడ్లకు మరమ్మత్తులు ప్రారంభించారు. ఈ మేరకు సిపిఐ మండల కార్యదర్శి శివకుమార్ గుంతలు పడిన రోడ్లను సందర్శించి ప్రస్తుతం బాపూజీ స్కూల్ దగ్గర నుండి పాపానాయుడుపేట వరకు గుంతలు పూడ్చడం జరిగిందన్నారు. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరగా ఆర్ అండ్ బి అధికారులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## సంస్కృతి, సంప్రదాయాలు మరవొద్దు

ప్రజాశక్తి-ఏర్పేడు:విద్యార్థులు తమ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలని, పండుగలు, ఆచారాలను నేర్చుకోవాలని ఇది వారికి సమాజంలో విలువలను నేర్పిస్తుందని ఏర్పేడు, ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు వినాయక చవితి పూజ నిర్వహించారు. ఈపూజ లో ఉపాధ్యాయులు ఆదినారాయణ, విజయకుమారి, నిర్మల, స్కూల్ చైర్మన్ దేవి, అంగణవాడి వర్కర్ పాల్గొని పండుగ విశిష్టత , వినాయక పూజ ఎలా చేయాలో హెచ్ఎం ఉషారాణి పిల్లలకు వివరించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణేష్ ఉత్సవాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గణేష్ చతుర్థి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మట్టి వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వినాయక ప్రతిమలను, ఏకవింశతి పత్రితో అలంకరించి పూజలు చేశారు. విఘ్నేశ్వరుడి చేతిలో ఉంచిన గణేష్ లడ్డు రూ.1500/- కు వేలంలో పాడుకున్నారు. ఈ ఉత్సవాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, బాలరాజు, వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య, వృక్షశాస్త్ర విభాగపు అధ్యాపకులు డాక్టర్ కోటేశ్వర రావు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సుజనా ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమలనే పూజించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం వినాయక చవితికి ప్రజలందరూ మట్టి వినాయక ప్రతిమలనే వాడాలని గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జే.వి.వి.అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కెమికల్స్ కలిపిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తే నీరు కలుషితం అవటమే కాక, నీటిలోని జీవరాశులు కూడా చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, సుబ్బారావు, అరుణ్ కుమార్, మస్తాన్, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, రజినీకాంత్, శ్రీనివాసచారి, పసల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం, తొండవాడ, లింగాలగుంట ఎస్టీ కాలనీవాసులకు జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌తో కలిసి స్మార్ట్ రైస్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాలనీవాసులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులు పొందేందుకు స్మార్ట్ రైస్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కాలనీవాసులను పెన్షన్, రేషన్ సక్రమంగా అందుతున్నాయా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామ సుబ్బయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వో, స్థానిక కూటమి నాయకులు మోహన్ రెడ్డి, ఉమాపతి రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్యవేడు:సత్యవేడు మండలం పరిధిలో కొత్తమారికుప్పం గిరిజన కాలనీలో గిరిజనులకు స్థానిక ఎంపీటీసీ మోహన్ రెడ్డి మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ దారి మళ్లకుండా ఉండేందుకే ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో దినేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, పృథ్వి, పవన్, దినేష్, సుమంత్, చిన్నయ్య, గిరిజనులు,పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :రూరల్ మండలం, నేసనూరు, తిరుమలకుప్పం గ్రామపంచాయతీలలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు పాకెట్ ఫ్రెండ్లీ గా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధానకార్యదర్శి హేమంత్, పి.ఆర్.మంగళం సింగిల్ విండో ప్రెసిడెంట్ మోహన్ రాజు, డైరెక్టర్ భాస్కర్, టీడీపీ నాయకులు మోహన్, జె సీ బీ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రేషన్ దోపిడీని అరికట్టడం

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మట్టం శ్రావణి రెడ్డి

కోసమే కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టిందని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరు చౌక దుకాణాల వద్ద స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రేషన్ కార్డులపై సీఎం పోటోలు వేసుకున్నారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పారదర్శకంగా క్యూఆర్ కోడ్‌తో కార్డులను ముద్రించి లబ్ధిదారులకు పంపిణీ చేస్తోందన్నారు. ఈనెల 30 వరకు స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, చెన్నూరు నీటి సంఘం అధ్యక్షులు యారమాపు హేమ కుమార్ రెడ్డి, అల్లం కృష్ణయ్య, కటికాల శ్రీనివాసులు, అంకమ్మ, భాస్కర్, శ్రీనివాసులు, శైలజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్న దానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మంగళవారం గుడూరు, గమళ్ళపాలెం ప్రాంతం, ఓం సాయి రాం వృద్ధాశ్రమంలో బండి కృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంలో అన్న దానకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ఉమామహేశ్వరి, హోమ్ టేకర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుపడి సెక్యూరిటీ గార్డ్‌కు గాయాలు

**ప్రజాశక్తి - తిరుమల:** తిరుమల, ఎంబీసీ 34లో భారీ వృక్షం విరిగిపడటంతో సెక్యూరిటీ గార్డ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. చంద్రశేఖర్ రెడ్డి టెంపుల్ సెక్టర్ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. తను విధులు నిర్వహిస్తుండగా ఓ భారీ వృక్షం గాలికి విరిగిపడింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడే ఉన్న సిబ్బంది ఆయనను చికిత్స నిమిత్తం తిరుమలలోని అశ్విని హాస్పిటల్‌కు తరలించారు.

## తిరుమల మొదటి ఘాట్ రోడ్లో వరుస ప్రమాదాలు

**ప్రజాశక్తి - తిరుమల :** తిరుమల నుండి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్ రోడ్లో కొన్ని గంటల వ్యవధిలోనే రెండు ప్రమాదాలు జరిగాయి. మంగళవారం సాయంత్రం 55వ మలుపు ఆర్టీసీ బస్సు ముందు టైరు ఊడిపడిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మరో ప్రమాదంలో తిరుమలకు వస్తున్న తమిళనాడుకి చెందిన కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు భక్తులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని 108 ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదాలు కారణంగా ట్రాఫిక్ అంతరాయం కావడంతో టిటిడి విజిలెన్స్, పోలీసు సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

## ఎస్వీ జూ పార్కులో 23 ఏళ్ల ఆడ సింహం మృతి



ప్రజాశక్తి–తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల(జూ పార్క్)లో గత 23 ఏళ్లుగా ఉన్న ఆడ సింహం ఇందు మంగళవారం మృతి చెందినట్లు జూ పార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. 2002లో థానే నేషనల్ సర్కస్ నుండి రక్షింపబడిన 18 సింహాలలో ఇందూ ఒకటన్నారు. 8 నెలల వయసులో శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు తీసుకొచ్చామన్నారు. వృద్ధాప్య కారణాలతో ఆరోగ్యం క్షీణించి మృతి చెందిందని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ వైద్యుల నిపుణుల బృందం ఇందు మృతదేహానికి పరీక్షలు నిర్వహించి, వృద్ధాప్య కారణాలే మరణానికి కారణంగా తేల్చారన్నారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్ట్

నిందితుడు బందేల రవి

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 20న తిరుపతి కోరమీనుగుంటలోని సిపిఆర్ అర్బన్ అపార్ట్మెంట్ 202 లో ధనలక్ష్మి (73) హత్యకు గురైన విషయం విధితమే. మృతురాలు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బందేల రవిని ఆటోనగర్ బస్టాండ్ వద్ద మంగళ వారం అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయి నుండి మృతురాలు ధనలక్ష్మి చెవిలోని కమ్మలు రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వండి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయలసీమ ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగిన కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చి రాజకీయ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర కురమ, కురుబ, కురువ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైసీపీలో, నేడు కూటమి ప్రభుత్వంలో తమకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను కల్పించి మంత్రి పదవులు కూడా ఇచ్చారని, ఇప్పుడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా ఎదగడానికి అవకాశాలను కల్పించాలన్నారు. రాష్ట్ర సంఘం ఏర్పడి 9 ఏళ్లు గడిచిందని, అక్టోబర్ 12న విజయవాడలో పదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందినవారు వివిధ పేర్లతో పిలవబడుతున్నారని, వీరందరినీ ఈ వార్షికోత్సవ సభకు హాజరు పరిచి తమ ఐక్యతను చాటుతామన్నారు. అన్నమయ్య జిల్లా కమిటీని ఈ నెల 28న నియమించనున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డి కుమార్, తంబళ్లపల్లి అధ్యక్షులు శ్రీనివాసులు, మదనపల్లి అధ్యక్షులు రాజన్న, మదనపల్లి టౌన్ అధ్యక్షులు గుడి రామానుజులు పాల్గొన్నారు.

## సంస్కృత విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన అబుదాబి సభ్యులు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని మంగళవారం అబుదాబి అక్షర పురుషోత్తం మందిరం ముఖ్యులు బ్రహ్మ బిహారీదాస్ స్వామి, రీసెర్చ్ సెంటర్ అక్షరధామ్ గాంధీనగర్, గుజరాత్ ముఖ్యులు శృతి ప్రకాష్ దాస్ స్వామి, ఇంగ్లాండ్ దేశంలోని వివిధ అక్షర పురుషోత్తమ దర్శన అనుయాయులు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బ్రహ్మ బిహారిదాస్ స్వామి మాట్లాడుతూ భారతదేశంలో సంస్కృత విశ్వవిద్యాలయం ఈ విధంగా ఉండడం ఎంతో గొప్ప విషయమని అన్నారు.

# మా ఊర్లో భారీ వినాయకుడు

- సినిమా సెట్టింగులతో వినాయకుడికి పూజా కార్యక్రమాలు
- పాతికేళ్లుగా ఇంత గొప్ప కార్యక్రమం చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది : కమిటీ సభ్యులు

**ప్రజాశక్తి - నాయుడుపేట:** ఈరోజు నుంచి వినాయక చవితి మొదలైంది నాయుడుపేట లోని ప్రతి వీధిలోను వినాయక విగ్రహాలు వెలిశాయి. నాయుడుపేట పట్టణంలో దాదాపుగా 100కు పైగా విగ్రహాలను పెట్టారు. ప్రతి వీధిలోను యువకులు, పెద్దవారు కలిసి ఎవరి స్థాయిలో వారు రకరకాలుగా మండపాలను ముస్తాబు చేసి మహత్తరమైన పూజా విధానాలతో వినాయక చవితి కార్యక్రమాలను ప్రారంభించారు. పట్టణంలో ఎన్ని విగ్రహాలు వెలసినప్పటికీ పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూసేది పట్టణంలోని గ్రంథాలయం ముందు పొట్లపూడి రాజేష్, సాయిరాం కిషోర్, కుమార్, భయ్యా బ్రదర్స్, హంస పృధ్వి స్టాలిన్, కేవల్, రాము బృందంతో కలిసి ఏర్పాటు చేసే అతి భారీ వినాయక విగ్రహ ఏర్పాట్లు కోసం, వినాయక చవితి కోసం వారు వేసే వినూత్నమైన సెట్టింగుల కోసం. నాయుడుపేట పట్టణంలో టిడిపి యువ నాయకుడు, ఎస్ జె జ్యులరీ అధినేత పొట్లపూడి రాజేష్ గత పాతికేళ్లుగా ఆయన ఇంటర్ చదువుతున్నప్పటి నుంచే వ్యాపారస్తులను కలుపుకొని ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకుని వినాయక చవితి ఉత్సవ కమిటీ పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాతికేళ్లుగా ఈ కార్యక్రమాన్ని అనేక విధాలుగా ప్రతి సంవత్సరం కొత్త కొత్త మార్పులతో నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల మండలాల ప్రజలు, పరిసర నియోజకవర్గాలకు సంబంధించిన పెద్ద పెద్ద నాయకులు సైతం పాల్గొంటున్నారంటే ఏ స్థాయిలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారో ఊహించుకోవచ్చు. ప్రతి సంవత్సరం సినిమా సెట్టింగులతో అద్భుతమైన ముస్తాబులతో భారీ విగ్రహాన్ని పెట్టడం వీరి ప్రత్యేకత. గత సంవత్సరం వినాయక చవితికి వీరు వేసిన బాహుబలి 1 సెట్టింగ్ గురించి ఇప్పటికీ చెప్పుకుంటున్నారంటే ప్రజలను ఏ స్థాయిలో ఆకట్టుకుందో తెలుస్తుంది. ఈ సంవత్సరం నిర్వహించే ఉత్సవాన్ని అంతకుమించి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సంవత్సరం వేస్తున్న బాహుబలి 2 సెట్టింగ్ మరింత భారీ స్థాయిలో ఉండిపోతుందని వారు తెలిపారు. కమిటీ సభ్యులు తాము నిర్వహిస్తున్న ఉత్సవం గురించి వివరిస్తూ గత పాతికేళ్లుగా వ్యాపారస్తులందరూ ఈ స్థాయిలో ఉత్సవం నిర్వహించేందుకు సహరిస్తున్నారని మామూలుగా వినాయక చవితి అంటే పట్టణంలోని పెద్దపెద్ద వారి సహాయం తీసుకుని చందాలు వసూలు చేసిన నిర్వహిస్తుంటారని, కానీ మా కమిటీ మాత్రం ఎక్కడ చందాలు వసూలు చేయలేదని మాకు మేమే సహకరించుకుంటూ ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించగలగడం ఆ గణనాధుని వరంగా భావిస్తున్నామన్నారు. ఈ పాతికేళ్లలో మేము నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఎక్కడ ఎలాంటి ఆపశృతి కలగకుండా అందరి మన్ననలను పొందుతూ ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించేలా చేయగలగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇంత భారీ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు మాకు ఎంతగానో సహకరించిన సుళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీకి, సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యంకి, టిడిపి నాయకులకు, పోలీసులకు, విద్యుత్ శాఖ వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు వీరందరి సహాయ సహకారాలు మరువలేనివని తెలిపారు. 25 అడుగుల భారీ విగ్రహాన్ని ఈ వినాయక చవితి కోసం హైదరాబాదు నుంచి తెప్పించామని, గణనాథుడు హైదరాబాదు నుంచి మూడు రోజులు ప్రయాణంతో నాయుడుపేటకు చేరుకున్నాడని ఈరోజు బుధవారం ఉదయం ఎమ్మెల్యే విజయ శ్రీ చేతులమీదుగా తొలి పూజతో ప్రారంభించి 9 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలతో, పూజలతో ఉత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. ఎప్పటిలాగే మన ఎమ్మెల్యే ఇన్చార్జిలతో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల నాయకులు పాల్గొంటారన్నారు. వారితో పాటు ప్రజలు కూడా వేల సంఖ్యలో పాల్గొంటారని వారందరికీ దర్శనానికి ఇటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని రాజేష్ తెలిపారు. 9వ రోజు అన్నదాన కార్యక్రమం అనంతరం స్వామిని నిమజ్జనం కోసం నెల్లూరుకు తరలించనున్నామని అక్కడ పోలీసుల సూచనల ప్రకారం నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు.

### యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

**ప్రజాశక్తి -ఏర్పేడు :** పేదలకు సేవలందించాలని యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థను స్నేహితులైన డాక్టర్ గానుగపెంట రమేష్, తాళిక్కాల్ వెంకటేశ్వర్లు స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో ఏర్పడుతున్న కాలుష్యాన్ని గుర్తించి గత ఆరేళ్లనుండి శ్రీకాళహస్తి నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నారు.

## మహిళా వర్సిటీలో డేటా అనలిటిక్స్‌పై సదస్సు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతిలో గణాంకశాస్త్రం, గణితశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో "ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్లకు డేటా అనలిటిక్స్ ప్రాధాన్యం" అనే అంశంపై ఒక రోజు సదస్సు మంగళవారం సావేరి సెమినార్ హాల్ లో నిర్వహించారు. ముఖ్య వక్త అమెరికా డా. వెంకట్ ఇక్కుర్థి, గణాంకవేత్త, డేటా శాస్త్రవేత్త, ముఖ్య కార్యనిర్వాహక అధికారి, చాణుక్య విద్యా కేంద్రం, అమెరికా సంయుక్త రాష్ట్రాలు హాజరై విద్యార్థులకు డేటా అనలిటిక్స్ ప్రాధాన్యం, భవిష్యత్ అవకాశాలు, పరిశోధనలో, ఉద్యోగ రంగంలో దాని వినియోగాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఎ. శోభ, ఆర్. సత్యవతి, సుమవల్లిక, డా. ఎం. శివపార్వతి, ఎస్. జ్యోష్ణ, ఆచార్యులు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**ప్రజాశక్తి -రేణిగుంట:** తిరుపతి జిల్లా రేణిగుంటలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఒకటవ రేషన్‌షాపు వద్ద మంగళవారం పంపిణీ చేశారు. రేణిగుంట టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ అర్హులైన అందరికీ రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కార్డులు అందజేస్తారు. కార్యక్రమంలో రేణిగుంట బూత్ ఇన్చార్జ్ రమ్య, ముస్లిం మైనార్టీ నవాబ్, హమీద తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో కిక్కిరిసిన బజారు వీధులు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** వినాయక చవితి పండగను పురస్కరించుకొని తిరుపతి నగరంలోని బజారు వీధులు వినియోగదారులతో కిక్కిరిశాయి. తిరుపతి నగరం చుట్టుపక్క ప్రాంతాల నుంచి గ్రామీణులు, అక్కడ లభించే పండ్లు, పత్రి తదితర పూజా సామగ్రిని నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తారు. ఈ కొనుగోళ్లతో బజారు వీధులన్నీ కిక్కిరిశాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాఫిక్కులను ఇతర ప్రాంతాలకు మళ్లించారు.

## వైభవంగా సామవేద ఉపాకర్మ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సామవేద ఉపాకర్మ మంగళవారం శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం భాద్రపద శుక్లపక్షహస్తా నక్షత్రంలో ఉపాకర్మ నిర్వహించడం వేద సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ కర్మ కేవలం శరీర శుద్ధికే పరిమితం కాకుండా, విద్యార్థుల మనోశుద్ధి, బుద్ధిశుద్ధి, విద్యాభివృద్ధికి పునాది వేస్తుందని నిర్వహకులు తెలిపారు. ఈ ఉపాకర్మకు సామవేద విభాగాధ్యక్షులు డాక్టర్ గిరిజా ప్రసాద్ షడంగి పర్యవేక్షణ వహించగా, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెరగాలి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెరగాలని వినాయక చారిటబుల్ ట్రస్ట్ అధినేత సురేంద్ర కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో మంగళవారం ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా 1500కు పైగా విగ్రహాలను ఈ ఏడాది పంపిణీ చేసినట్లు సురేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు.

## జాతీయ సేవా పథకంపై అవగాహన

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 2025 బిటెక్ కోర్స్ కోసం కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇండక్షన్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ఆగష్టు 4 నుండి 28వ వరకు నిర్వహిస్తోంది. ఈ మూడు వారాల ప్రోగ్రామ్స్ ముఖ్య లక్ష్యం. విద్యార్థులు కొత్త వాతావరణానికి అలవాటు పడేందుకు, అధ్యాపకులతో విద్యార్థులకు మంచి సంబంధాలు ఏర్పడేందుకు ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 9,10,12,15 ప్రోగ్రామ్ అధికారులు డా. యువశ్రీ, డా. కల్పన, పల్లవి, దివ్య జాతీయ సేవా పథకంపై రెండు రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ముఖ్య అతిథి, స్టేట్, నేషనల్ అవార్డు గ్రహీత డి. వెంకమరాజు విచ్చేశారు. వారు మాట్లాడుతూ నేటి యువత సమాజానికి చేయవలసిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ :** వడమాలపేట మండలం, ఎస్.వి.పురం టోల్గేట్ వద్ద ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సహకారంతో తిరుపతి వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ వారు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 75 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 14 మందికి కాట్రాక్ట్ ఆపరేషన్‌కి సెలెక్ట్ చేశారు. విజయశ్రీ బ్లడ్ బ్యాంకు తిరుపతి వారిచే జరిగిన రక్తదాన శిబిరంలో10 మంది రక్తదానం చేశారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ శిబిరం వ్యవస్థాపక అధ్యక్షులు కోనేటి రవిరాజు, టోల్గేట్ ఇంచార్జ్ దొమ్మరాజు సుమన్ రాజుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ వెంకటేష్, టెక్నీషన్స్ అంబిక, మంజునాథ్, విజయ శ్రీ బ్లడ్ బ్యాంకు మేనేజర్ హరి కృష్ణ, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 302 సెక్రెటరీ మునికృష్ణ, అఖిల భారతీయ క్షత్రియ మహాసభ జిల్లా కోశాధికారి సుకుమార్ రాజు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి పట్టణ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు రికార్డులను పరిశీలించారు. యూరియా నిల్వలను తనిఖీ చేశారు. ఎరువులు విక్రయించినప్పుడు రైతులకు రసీదులు ఇస్తున్నారో..! లేదో..! ఆరా తీశారు. ఎరువులను అదనంగా నిల్వ ఉంచినా, పక్కదారి పట్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు హెచ్చరించారు, టూ టౌన్ సిఐ నాగార్జున రెడ్డి, ఏడిఏ రమేష్ బాబు, ఏవో మమత తదితరులు పాల్గొన్నారు.

# 'వాస్తవాల' ప్రతిబింబం 'ప్రజాశక్తి'

తిరుపతి వార్షికోత్సవ సభలు వక్తలు

'ప్రజాశక్తి'ని ముందుకు తీసుకెళుతున్న పలమనేరు, తిరుపతి ఏజెంట్లకు సత్కారం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

'సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమే.. రాజ్యాంగం కల్పించిన హక్కులు పేద ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో అనుభవించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి 'ప్రజాశక్తి' దినపత్రిక అహర్నిశలు కృషి చేస్తుంది... ప్రస్తుతం సమాజంలోని అన్ని వ్యవస్థలు కార్పొరేట్‌మయం అయిన నేపథ్యంలో ప్రజాశక్తి పత్రిక నోరులేని వారి గొంతుకగా ప్రశ్నిస్తోంది... ప్రజా వ్యతిరేక విధానాలను ప్రచురించే ఏకైక దమ్మున పత్రిక' అని వక్తలు ఉద్ఘాటించారు. 'ప్రజాశక్తి'45వ వార్షికోత్సవ సభ తిరుపతిలో 'మేక్ మై బేబీ జీనియస్' పాఠశాల వేదికగా మేనేజర్ సిఎస్ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విచ్చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ఎంఎంబిజి విద్యాసంస్థ నిర్వాహకురాలు సంగరాజు అశ్విని హాజరయ్యారు. ముందుగా 'ప్రజాశక్తి' వార్షికోత్సవం సందర్భంగా తీసుకొచ్చిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు.

## వ్యవస్థలు రూటు మార్చాయి : డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎపి హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్

ఏ వ్యవస్థలైతే ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఉద్దేశించబడ్డాయో నేడు ఆ వ్యవస్థలు తన రూటును మార్చుకొని కమర్షియల్ వైపు అడుగులు వేస్తున్నాయి. విద్యావ్యవస్థ, వైద్య వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఇలా ఏ వ్యవస్థ అయినా ప్రజల కోసం పనిచేయాల్సి ఉంటే నేడు ఉన్న పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కొంతమంది తీసుకునే నిర్ణయాలను ప్రజలకు చెప్పే ధైర్యం లేక కొన్ని పత్రికలను అణచివేస్తున్నారు. కానీ ప్రజల కోసం, పేదల కోసం ఎల్లప్పుడు కృషి చేసే ప్రజాశక్తి దినపత్రిక మాత్రం వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తుంది. ఏ వ్యవస్థ తప్పు చేసిన ధైర్యంగా తన గళాన్ని ప్రజాశక్తి వినిపిస్తోంది.

## వాస్తవాలకు అద్దం పట్టే పత్రిక వందవాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి దినపత్రికలో వచ్చే వార్తలు వాస్తవిక పరిస్థితులను అద్దం పట్టే విధంగా ఉంటాయి. దేశంలో కార్పొరేట్ల వలన జరుగుతున్న అన్యాయాలను దీటుగా ఎదుర్కొనే ధైర్యం, దమ్ము ఉన్న పత్రిక ప్రజాశక్తి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ కార్పొరేట్ కంపెనీకి సంబంధించిన స్మార్ట్ మీటర్లను నేలకేసి పగలకొట్టండి అన్నవారే నేడు ఆ స్మార్ట్ మీటర్లను గోడకు కొట్టండి అని అంటున్నారు. దేశంలో జరిగే ఎన్నో కుట్రలు కుతంత్రాలను ప్రజల ముందు ఉంచే ధైర్యం ఉన్న పత్రికగా ప్రజాశక్తికి పేరుంది. ఎంతోమంది సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, వైద్యులు, ఉన్నత విద్యావంతులు ఏదో ఒక సందర్భంలో తన అనుభవంలో ప్రజాశక్తిలో వచ్చిన కథనాలను ప్రస్తావించే పరిస్థితి. ఎందుకంటే వాస్తవ కోణాలను గ్రహించినవారు ఏనాటికీ మరిచిపోలేరు.

## ప్రశ్నిస్తేనే సమాజంలో మార్పు : వివేక్, డిఎఫ్ఒ

సమాజంలో మార్పు కోరుకునేవారు జరిగే పరిస్థితులపై ప్రశ్నించాలి. మంచి గౌరవాన్ని పొందాలి అనే ఆశ ఉంటే సరిపోదు. అందుకు తగిన కఠోర దీక్ష, ఆ దిశగా ప్రణాళికా బద్ధంగా ఎదగాలి. అపుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించి, సమాజంలో ప్రత్యేకమైన గౌరవాన్ని పొందగలుగుతారు. ప్రజాశక్తి వార్షికోత్సవాన్ని విద్యార్థులతో కలిసి నిర్వహించడం సంతోషంగా ఉంది. రేపటి తరాలే భావిభారత పౌరులుగా ఎదుగుతారు. సమాజంలో ప్రశ్నించే స్థాయికి ఎదగాలంటే అన్ని స్కూళ్లల్లోనూ జర్నలిజంపై చైతన్యం కల్పించాలి.

## సైనికున్ని..సేవకున్ని..: కె.శ్రీధర్ నవజీవన్ ట్రస్టు నిర్వాహకులు

1968-1971 కొత్త గూడెంలో ట్రైబల్స్‌తో కలిసి విద్యను అభ్యసించారు. మిలిటరీ ఉద్యోగంలో రిటైర్ అయ్యి, నేడు సామాజిక సేవలో ఉంటున్నాను. ఎక్కువగా నేను తీవ్రమైన కమ్యూనిస్టు అభిమానిని. ఈ రోజుల్లో పత్రిక నడపడం అంత సులువైన పని కాదు. ప్రజల గొంతుకగా ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్ళకు కట్టినట్టు చూపే ఏకైక పత్రిక ప్రజాశక్తి. రాబోయే రోజుల్లో దినదినాభివద్ధి చెందుతూ ప్రజాశక్తి దినపత్రిక గోల్డెన్ జూబ్లీ కూడా జరుపుకోవాలని ఆశిస్తున్నాను.

## ప్రజాస్వామ్యం పరిరక్షింపబడాలి : కె.మురళీమోహన్, ఆర్‌టిఒ

నేడు సమాజంలో విపరీత ధోరణులు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షింపబడే ఒక ఆయుధంగా ప్రజాశక్తిని చెప్పవచ్చు. సమాజంలో మార్పుకై అహర్నిశలు కృషి చేస్తున్న ప్రజాశక్తి సిబ్బందికి, విలేకరులకు శుభాకాంక్షలు. కార్మిక, కర్షకులకు, పేదల కష్టాలను తీర్చే పత్రికగా ప్రజాశక్తి ఇంకనూ దినదినాభివద్ధి చెందాలని కోరుకుంటున్నాను. 'ప్రజాశక్తి' సేవలపై తనదైన శైలిలో ఓ కవితను ఆలపించి ఆకట్టుకున్నారు.

## పీపుల్స్ జర్నలిజం నేర్పేది ఒక్క ప్రజాశక్తి :కె. నేతాజీ జర్నలిస్టు

నా జర్నలిజం ప్రయాణం ప్రజాశక్తితో మొదలైంది. ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నా ఆ మూలాలను మరచిపోలేం. పీపుల్స్ జర్నలిజం నేర్పేది ఒక్క ప్రజాశక్తిలోనే. ప్రజాశక్తిలో మనుషులను మనుషులను గౌరవించే పద్ధతులు, క్రమశిక్షణ, సంస్కారాలను నేర్పింది. నా జర్నలిజం కెరియర్‌లో 'ప్రజాశక్తి'లో పనిచేసినందుకు గర్వంగా చెప్పుకుంటాను.

## వాస్తవ పరిస్థితుల గళం : జీబీఎస్ మణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు

'ప్రజాశక్తి' వాస్తవ పరిస్థితుల గళం.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు దాసోహం అవుతూ చేసే అన్యాయాలపై వాస్తవ పరిస్థితులను ప్రజా గొంతుకగా 'ప్రజాశక్తి' తన గళంతో ఓ గొంతుకగా ప్రజల చెంతకు చేరుతుంది. ఈ దేశంలో ఒక పత్రికపైన కక్షగట్టి బ్యాన్ విధించారంటే అది ప్రజాశక్తిపైనే. 'కార్పొరేట్ అదానీకి ఒక జిల్లాకు సంబంధించిన భూభాగాన్ని ఇచ్చేస్తారా' అని ఓ న్యాయమూర్తి అడిగిన ప్రశ్నను ప్రజాశక్తి మాత్రమే దమ్మున్న పత్రికగా ప్రచురించింది.

అతిథులతో జిల్లా బ్యూరో వలిగలం గోపి, డెస్క్ ఇంచార్జి అవనిగడ్డ వనజ, ప్రకటనల విభాగం జిల్లా ఇంచార్జి శ్రీనివాసులు, తిరుపతి నగర ఇంచార్జి నాగరాజు, సర్కులేషన్ ఇంచార్జి సురేష్, జాబ్‌వర్కు విభాగం ఇంఛార్జి గుణశేఖర్, గుర్రప్ప, తేజ, మునిమోహన్, సురేంద్ర, సుధీర్, విజయ్, శ్రీపతి పాల్గొన్నారు.